Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/


# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
19-11-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 9

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## పిల్లలు ఎందరున్నా పోటీకి ఓకే

### స్థానిక ఎన్నికలపై పీఆర్ చట్టానికి సవరణ



- దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గింది
- మన రాష్ట్రంలో 1.6కి పడిపోయింది
- 15 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య తగ్గుతోంది
- సంతానోత్పత్తిని, యువ జనాభాను పెంచేందుకే ఈ బిల్లు: మంత్రి మనోహర్
- బిల్లుకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం
- పురపాలక చట్టానికీ ఇదే సవరణ

అమరావతి, : రాష్ట్రంలో ఎంత మంది సంతానం కలిగి ఉన్నవారైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు మార్గం సుగమమైంది. ఆ మేరకు పంచాయతీరాజ్, పురపాలక శాఖల చట్టాలకు చేసిన సవరణలను శాసనసభ సోమవారం ఆమోదించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరఫున పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. అసెంబ్లీలో పంచాయతీరాజ్ చట్టం-1994లో సవరణలు ప్రతిపాదిస్తూ బిల్లును ప్రవేశపెట్టారు. ఎందుకు సవరణ చేయాల్సి వస్తోందో వివరించారు. 1980-90 మధ్య దేశంలో జనాభా పెరుగుదలను

2లో

## మహారాష్ట్రలో ఓటమి మోదీకి ముందే తెలిసింది!

- వీలైతే కేంద్ర కమిటీని పంపండి వివరాలన్నీ ఇస్తా: రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ హామీలపై ఆరోపణలా? మావి కచ్చితమైన గ్యారెంటీలు..
- మహారాష్ట్రను విద్రోహాలకు అడ్డాగా మార్చిన మోదీ
- ఎన్నికల ప్రచారంలో రేవంత్



హైదరాబాద్, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి ఓడిపోతుందనే విషయం ప్రధాని మోదీకి ముందే తెలిసిపోయిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే మోదీ మూడు రోజులుగా ప్రచారం చేయకుండా విదేశాలకు వెళ్లి పోయారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పుణెలో జరిగిన మీడియా సమావేశంలో, కడెగావ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైన ప్రధాని మోదీ.. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాల హామీల అమలుపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారెంటీలంటే కచ్చితమైన గ్యారెంటీలు అని, అవి.. మోదీ గ్యారెంటీల్లా కాదని అన్నారు. కేంద్ర మంత్రితోగానీ, కేంద్ర ఉన్నతాధికారి ఆధ్వర్యంలోగానీ ఒక కమిటీని వేసి తెలంగాణకు పంపిస్తే రాష్ట్రంలో హామీల అమలుపై ఆ కమిటీకి వివరాలు ఇస్తానని చెప్పారు. మోదీ 11

2లో



### కర్ఫ్యూ ఉల్లంఘించి అల్లర్లు

- మణిపూర్‌లో మరింత క్షీణించిన పరిస్థితి
- ప్రభుత్వ ఆఫీసులకు నిరసనకారుల తాళాలు
- మణిపూర్‌కు అదనంగా 5 వేల బలగాలు

2లో

## మణిపూర్ పరిస్థితే లగచర్లలోనూ



- హక్కుల కోసం 9 నెలలుగా గిరిజనుల పోరాటం
- దమనకాండపై రాహుల్, మోదీ స్పందించాలి
- రూ.60 లక్షలు భూమికి రూ.8 లక్షలైనా ఇవ్వరా?
- రేవంత్ రెడ్డి సోదరుడికి ఏ హోదాతో ప్రోటోకాల్?
- ప్రభుత్వాన్ని అస్థిరపర్చం.. రేవంతే ఐదేళ్లూ ఉండాలి
- ఆ తర్వాత 15 ఏళ్లు మేమే.. ఢిల్లీలో కేటీఆర్

న్యూఢిల్లీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని లగచర్లలోనూ మణిపూర్ వంటి పరిస్థితే ఉందని, అక్కడి గిరిజనుల గోడు దేశమంతా వినాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. తెలంగాణలో గిరిజనులకు న్యాయం దక్కడం లేదని, అందుకే వారి సమస్యను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకొచ్చామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచాల్సిన అవసరం తమకు లేదని, ఐదేళ్లూ ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. ఢిల్లీకి కావాల్సిన మూటలు అందించగల సత్తా రాష్ట్రంలో రేవంత్ రెడ్డికి మాత్రమే ఉందన్నారు. అందుకే ఆయనే ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా ఉంటాడని భావిస్తున్నానని, ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఆ తర్వాత 15ఏళ్లు అధికారం తమదేనన్నారు. సోమవారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో లగచర్ల బాధితులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత లగచర్ల ఘటన, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిల గత వ్యాఖ్యల వీడియోను ప్రదర్శించారు.ఆ తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ మణిపూర్, ముంబైలోని ధారావి, యూపీలోని ఝాన్సీ ఘటనపై తాము విచారం వ్యక్తం చేస్తున్నామని, లగచర్ల ఘటన వాటికంటే తక్కువేం కాదన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గిరిజన మహిళలపై చేసిన అఘాయిత్యాలను దేశ ప్రజలందరికీ తెలిసేలా చేసేందుకే ఢిల్లీకి వచ్చామన్నారు. రైతులు, బీసీ, దళితులు, గిరిజనుల సంక్షేమం గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పదే పదే ప్రస్తావిస్తారని, అయితే రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజన మహిళల ఆవేదనను రాహుల్ వినాలన్నారు. అర్ధరాత్రి పోలీసులు వచ్చి ఎలా లైంగిక దాడులు చేస్తున్నారో, ఎలా శారీరకంగా హింసించారో, ఎలా అరెస్టులు చేస్తున్నారో లగచర్ల బాధితులు వివరంగా చెబుతున్నారని, ఆ దమనకాండపై మోదీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. దేశంలో తెలంగాణ అనే రాష్ట్రం ఉందని ప్రధాని మరిచిపోయారా? అని వ్యాఖ్యానించారు. 50 నుంచి 60 ఏళ్లుగా ఇవే భూములపై ఆధారపడి బతుకున్నామని, రేవంత్‌రెడ్డి అల్లుడి ఫార్మా కంపెనీ కోసం తమ భూములను కోల్పోవాలా? అని

2లో

## బీఆర్ఎస్ పనైపోయింది

- బీఆర్ఎస్ పదేళ్ల, ప్రస్తుత పాలనపై చర్చకు సిద్ధమేనా?
- గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలకే కేసీఆర్ టైమ్ ఇవ్వలేదు
- కాంగ్రెస్‌లో పూర్తి స్వేచ్ఛ.. కార్యకర్తలూ సీఎంను కలవొచ్చు
- కష్టపడ్డ కార్యకర్తలను స్థానిక ఎన్నికల్లో గెలిపించుకుంటాం
- ఈ ఐదేళ్లే కాదు.. వచ్చే ఐదేళ్లూ కాంగ్రెస్ పార్టీదే అధికారం
- రాహుల్ ప్రధాని కావడం ఖాయం: టీపీసీసీ చీఫ్ మహేశ్
- సంగారెడ్డిలో భారీ ర్యాలీతో స్వాగతం పలికిన జగ్గారెడ్డి

## నేను భారతీయులకు గులామ్‌ని!

- మీరు ఇటలీ నేతలకు బానిసలు
- ప్రభుత్వ వైఫల్యాల్ని ఎత్తిచూపితే వ్యక్తిగత విమర్శలు చేస్తారా?
- ఏడాదైనా పథకాల అమలేదీ?
- కోతలు, అబద్ధాలతో గడిపేశారు
- సీఎం రేవంత్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం
- రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై బీజేపీ నేతల వర్క్‌షాపు





# కర్ఫ్యూ ఉల్లంఘించి అల్లర్లు

ఇంఫాల్, న్యూఢిల్లీ, నవంబరు 18: మణిపూర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మరింత క్షీణించింది. నిరసనకారులు సోమవారం కర్ఫ్యూను ఉల్లంఘించి యథేచ్ఛగా అల్లర్లకు పాల్పడ్డారు. జిరిబమ్ జిల్లాలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లల హత్యకు నిరసనగా కొకొమి(కోఆర్డినేషన్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ) గ్రూపునకు చెందిన కొందరి నేతృత్వంలో జనం ఇంపాల్ పశ్చిమ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేశారు. జిరిబమ్ జిల్లాలో హత్యకు గురైన బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ నిరసనకారులు ఇంపాల్‌లోని చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ కార్యాలయంలోకి చొచ్చుకుపోయి ప్రధాన గేటుకు తాళం వేశారు. సమీపంలోని పలు కార్యాలయాలకు ఇదేవిధంగా తాళాలు వేశారు. అలాగే కుకి మిలిటెంట్లపై సైనిక చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంపాల్‌లో కొకొమి చేపట్టిన ధర్నా మూడోరోజుకు చేరుకుంది. మరోవైపు మణిపూర్ ప్రభుత్వం సోమవారం నుంచి బుధవారం వరకు ఏడు జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వరుసగా రెండోరోజు మణిపూర్‌పై కేంద్ర, ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. మరో 5 వేలమంది పారామిలిటరీ సిబ్బందిని ఆ రాష్ట్రానికి పంపాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులు ఆ రాష్ట్రంపై దృష్టి పెట్టి వెంటనే అక్కడ శాంతి భద్రతలను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇప్పటికే సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఏడీ సింగ్, ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఉన్నతాధికారులు ఆ రాష్ట్రంలో మకాం వేసి ఉన్నారు. గత వారం పంపిన కేంద్ర సిబ్బందితో కలిపి మొత్తం 218 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఆ రాష్ట్రంలో ఉన్నాయి. కాగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మణిపూర్‌లో తాజాగా చోటు చేసుకున్న హింసకు సంబంధించి మూడు కేసులను నమోదు చేసింది. జిరిబమ్ జిల్లాలో మహిళల హత్య.. సీఆర్‌పీఎఫ్ పోస్టుపై సాయుధ మూక దాడి.. బొరొబెక్రలో ఇళ్ల దహనం, ఒకరి హత్యకు సంబంధించిన కేసుల దర్యాప్తును ఎన్ఐఏ చేపట్టింది. మరోవైపు పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కాక ముందే ప్రధాని మోదీ కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పర్యటించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ పూర్తిగా విఫలమైందని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని కోరింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మణిపూర్ కాంగ్రెస్ చీఫ్ కె. మేఘచంద్ర సింగ్, ఆ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్‌లతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నవంబరు 25న పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాకముందే ఆ రాష్ట్రంపై జాతీయ స్థాయిలో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 31 నుంచి మణిపూర్‌కు పూర్తిస్థాయి గవర్నర్ కూడా లేరని పేర్కొన్నారు. పాలనలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని హోం మంత్రి ఎందుకు రక్షిస్తున్నారని ప్రశ్నించారు.



# నేను భారతీయులకు గులామ్‌ని!

హయత్‌నగర్, నవంబరు తాను ఎవరికీ గులామ్‌ను కాదని, భారతీయులకు మాత్రమే గులామ్‌నని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై సోమవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో బీజేపీ నిర్వహించిన వర్క్‌షాపులో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ, సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్, ప్రధాని నరేంద్రమోదీకి జన్మనిచ్చిన గుజరాత్‌కు గులామ్‌నని చెప్పారు. కాంగ్రెస్ నేతలు నకిలీ గాంధీ కుటుంబానికి, ఇటలీ నేతలకు గులామ్‌లని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎత్తి చూపితే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా మహారాష్ట్రలో ప్రచారం చేయడా నికి సీఎంకు సిగ్గుండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు, కోతలతో సంవత్సరం గడిపేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అప్పులు తేవడానికి ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ మాదిరిగా ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామన్నారని.. 340 రోజులు అవుతున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుటుంబ కాంట్రాక్టర్లు వచ్చారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు దివాలా తీశాయని విమర్శించారు. రాష్ట్రంలో ఆలయాలను కూల్చుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందన్నారు. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పని చేస్తుందని, భవిష్యత్ బీజేపీదేనని చెప్పారు.

# బీఆర్ఎస్ పనైపోయింది

సంగారెడ్డి, తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆ పార్టీలో కేసీఆర్, ఆయన కొడుకు, బిడ్డ మాత్రమే మిగులుతారని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావుతోపాటు మిగతా వారందరూ పలాయనం చిత్తగించి వేరే దారి చూసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సమావేశానికి మహేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో బీజేపీతో కుమ్మక్కై సర్కార్‌ను కూలుస్తామంటూ బీఆర్ఎస్ ప్రగల్భాలు పలికిందని, ఇప్పుడు ఆ పార్టీ ఎమ్మెల్యేలే కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ట్యాగ్‌లైన్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నేతలు.. వాటిని విస్మరించారని ఆరోపించారు. నీళ్ల ప్రాజెక్టుల పేరిట కుంభకోణాలు చేశారని విమర్శించారు. నిధులన్నీ పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. నియామకాల పేరిట నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగం చేస్తే... తాము మరమ్మతులు చేసుకుంటూ వస్తున్నామని వివరించారు. బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ కుటుంబం బంగారుమయంగా మారిందని ధ్వజమెత్తారు. వారి పదేళ్ల పాలన, తమ పదకొండు నెలల పాలనపై హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో హంగులు, ఆర్భాటాలు లేవని, అభివృద్ధి, సంక్షేమం మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లు కాదు.. వచ్చే ఐదేళ్లూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. కేంద్రంలోనూ రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం..**

కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన ఘనత టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికే దక్కుతుందని మహేశ్‌గౌడ్ కొనియాడారు. కాంగ్రెస్‌లో కార్యకర్తలకు పూర్తి స్థాయి స్వేచ్ఛ ఉంటుందని, ముఖ్యమంత్రిని సైతం నేరుగా కలిసే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ తన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు కూడా సమయం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు కార్యకర్తలే ప్రధాన బలం, బలగం అని పునరుద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే పలు కార్పొరేషన్ పదవులు భర్తీ చేశామని, జనవరిలోగా మిగతావీ భర్తీ చేస్తామని ప్రకటించారు. సమావేశంలో మంత్రి దామోదర, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలు ఎందరున్నా పోటీకి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

దృష్టిలో పెట్టుకుని.. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్న వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పేర్కొంటూ టీడీపీ ప్రభుత్వం 1994 మే 30న ఈ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిందని చెప్పారు. 'ఆ తర్వాత ఈ చట్టాన్ని వివిధ రాష్ట్రాల్లో అమలు చేశారు. జాతీయ ఆహార భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని జనాభా పెరుగదలను నియంత్రించడానికి అప్పుడీ చట్టం అవసరమైంది. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికలకు దీనిని వర్తింపజేశారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫహెచ్ఎస్) ప్రకారం.. దేశవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు తగ్గిపోతోంది. 1993–94లో 3.7గా ఉన్న ఈ రేటు ఇప్పుడు 2.1కి తగ్గిపోయింది. మన రాష్ట్రంలో ఇది 1.6కి పడిపోయింది. సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడంతో పాటు జనాభాలో 15 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారి సంఖ్య భారీగా పడిపోతోంది. 2015–16లో దేశ జనాభాలో 15 ఏళ్ల వయస్కులు 28.6 శాతం ఉంటే ఇప్పుడు 2 శాతానికి తగ్గిపోయింది. ఇది మన దేశ వృద్ధి రేటుపై ప్రభావం చూపే అవకాశముంది. దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త విధానాలను అనుసరిస్తోంది. ముఖ్యంగా యువ జనాభాను పెంచే విధంగా ప్రణాళికలు రచిస్తోంది. ముందుగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేసే విధంగా అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది.

సమాజంలో అందరికీ గుర్తింపు, సమాన హక్కులు ఉండాలనే ఉద్దేశంతో పాటు సంతానోత్పత్తిని పెంచాలనే ఉద్దేశంతో చట్ట సవరణ చేశాం' అని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువత తగ్గడం వల్ల రాష్ట్రాభివృద్ధి, స్థూల ఉత్పత్తికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, సంతానోత్పత్తి తగ్గడం చిన్న విషయం కాదన్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వంద మందిలో ఒక్కరు కూడా ముగ్గురు పిల్లలను కనడం లేదన్నారు. అసలు పిల్లలను కనేవారి సంఖ్య కూడా తగ్గిపోతోందని.. కొంత మంది ఒక్కరైతే చాలన్న ఆలోచనతో ఉంటున్నారని చెప్పారు. భవిష్యత్‌లో మన దేశం కూడా జపాన్‌లా తయారయ్యే ప్రమాదం ఉందని.. అందుచేత ప్రతి ఒక్కరూ సంతానోత్పత్తిని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి పెరగాలంటే ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. చర్చ అనంతరం బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఇదే విధంగా పురపాలక చట్టంలోనూ సవరణ కోరుతూ మున్సిపల్ మంత్రి పి.నారాయణ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. మున్సిపాలిటీల్లో కూడా ఎంత మంది పిల్లలున్నా పోటీ చేసేందుకు అర్హత కల్పించే ఈ బిల్లును సైతం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

# మణిపూర్ పరిస్థితే లగచర్లలోనూ

(మొదటి పేజీ తరువాయి)

గిరిజనులు ప్రశ్నిస్తున్నారన్నారు. తెలంగాణలో చిన్నపిల్లలు పిలిచినా వస్తానని చెప్పిన రాహుల్‌కు గిరిజన మహిళ ఆక్రందనలు ఎందుకు వినిపించటం లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ అంటూ రాహుల్ మాటలు చెప్పడం కాదని, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అరాచకాలను ఆపాలన్నారు.

**9 నెలలుగా పోరాడుతుంటే...**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచిగిరిజనుల భూములు లాక్కునే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఫార్మా విలేజ్ కోసం తమ భూములు ఇవ్వబోమని 9 నెలలుగా లగచర్ల రైతులు పోరాటం చేస్తుంటే ముఖ్యమంత్రి సహా ఎవరూ వారికి సమయం ఇవ్వలేదన్నారు. కలెక్టర్ వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు వారిని అరెస్టు చేశారన్నారు. దాదాపు 30 మంది రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. సంగారెడ్డి జైలుకెళ్లి చూశామని, వాళ్లు నడవలేకపోతున్నారని తెలిపారు. కొట్టామని జడ్జి ముందు చెబితే మళ్లీ కొట్టి కుటుంబ సభ్యులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. లగచర్లలోనే కాదని, భూములు ఇవ్వబోమని సంగారెడ్డిలో కూడా రైతులు ఆందోళన చేశారన్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పూర్తిగా వాళ్ల ఫ్యామిలీ ప్యాకేజ్‌గా మార్చేస్తున్నారన్నారు. తాము ఫార్మాసిటీ కోసం దాదాపు 14 వేల ఎకరాల భూమి సేకరించామని, అయితే తాము రైతులను ఒప్పించి, మెప్పించి వారికి సరైన పరిహారం ఇచ్చామన్నారు.




# హైవేపై అఘోరి హైడ్రామా

మంగళగిరి సిటీ, జగ్గయ్యపేట ఉభయ రాష్ట్రాల్లో గత కొద్దిరోజులుగా హల్‌చల్ చేస్తున్న అఘోరి సోమవారం మంగళగిరిలో హంగామా సృష్టించింది. అఘోరి తరచూ మంగళగిరి వస్తూ.. ఆటోనగర్ ఎదురుగా ఉన్న ఓ కార్ వాష్ సెంటరులో కారును శుభ్రం చేయిస్తోంది. సోమవారం ఉదయం కూడా కార్ వాష్‌కు రాగా.. పలువురు ఫొటోలు తీసేందుకు ప్రయత్నించారు. ఆగ్రహించిన అఘోరి త్రిశూలంతో వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో ఓ జర్నలిస్టు కాలు విరిగింది. తర్వాత మంగళగిరి డిపో రోడ్డు, ఆటోనగర్ మీదుగా నడుచుకుంటూ వెళ్లిపోయింది. కొద్దిసేపటి తర్వాత జనసేన కేంద్ర కార్యాలయం సమీపంలో ప్రత్యక్షమైంది. కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా జనసైనికులు జాతీయ రహదారిపైనే అడ్డుకున్నారు. డిప్యూటీ సీఎం కోసం వచ్చానని, ఆయనను కలిసే వెళతానంటూ అఘోరి హైవేపైనే బైఠాయించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. అఘోరికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. వారిపైనా దాడికి పాల్పడింది. శరీరంపై దుస్తులు కూడా లేకపోవడంతో పోలీసులు అఘోరిని బలవంతంగా తాళ్లతో బంధించి, వస్త్రాలు కప్పారు. కొద్దిసేపటి తర్వాత బంధనాలు తొలగించడంతో మళ్లీ వారిపై విరుచుకుపడింది. దాదాపు మూడున్నర గంటలసేపు హైవేపై హల్‌చల్ చేసింది. ఎట్టకేలకు స్థానికులు, పోలీసులు నచ్చజెప్పి.. అఘోరిని ప్రత్యేక వ్యానులో ఎక్కించి, బందోబస్తు మధ్య రాష్ట్ర సరిహద్దులు దాటించారు. చిల్లకల్లు పోలీసులు గౌరవరం నుంచి ప్రత్యేక ఎస్కార్ట్‌తో ఆమె వాహనాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించారు. దారిలో వాహనం ఆపి దిగాలని ఆమె ప్రయత్నించినా పోలీసులు అడ్డుకుని, వేగంగా సరిహద్దులు దాటించేశారు.

# మహారాష్ట్రలో ఓటమి మోదీకి ముందే తెలిసింది!

(మొదటి పేజీ తరువాయి)

ఏళ్ల పాలనలో చెప్పుకోవడానికి ఒక్క విజయగా?థ కూడా లేకపోవడంతో ప్రతి ఎన్నికల ముందు బాంబుపేలుళ్లు, ఇతర విషయాలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. 2014 ఎన్నికలకు ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, దేశంలోని ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మిస్తామంటూ నరేంద్రమోదీ హామీ ఇచ్చారని రేవంత్ గుర్తు చేశారు. కానీ, చివరికి మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చారన్నారు. దేశంలోనే అత్యధికంగా రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలో చోటుచేసుకుంటున్నాయని, ప్రధాని మోదీ ఈ విషయంపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలని చెప్పిన ప్రధాని మోదీ.. 11 ఏళ్ల పాలనలో అందులో ఒక్క శాతం కూడా ఇవ్వలేదని రేవంత్ అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఏటా 2 కోట్ల ఉద్యోగాలపై లోక్‌సభలో ప్రశ్న అడిగితే కేవలం కేవలం 7.50 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చినట్లుగా మోదీ ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి వారి రుణాలను మాఫీ చేశామని తెలిపారు. 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. యూపీఏ హయాంలో సోనియాగాంధీ సూచన మేరకు దీపం పథకం కింద రూ.400కే గ్యాస్ సిలిండర్, స్టవ్‌లను అప్పటి ప్రభుత్వం అందజేసిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక రూ.400 సిలిండర్‌ను రూ.12000కు పెంచేశారని, తద్వారా పేద మహిళలు వంటింట్లో దాచుకున్న డబ్బును మోదీ చోరీ చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో తాము పేద మహిళలకు రూ.500కే సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ, బీజేపీ నేతలు హైదరాబాద్‌కు వస్తే సచివాలయంలో కూర్చోబెట్టుకుని తాను చెప్పిన ప్రతి అంశానికీ వివరాలను అందజేస్తానని, ఇందులో ఏమైనా తప్పులు ఉంటే క్షమాపణలు చెబుతానని ప్రకటించారు. మహారాష్ట్ర ప్రజలు మహా వికాస్ అఘాడీని గెలిపిస్తే తెలంగాణలో అమలవుతున్నట్లుగానే ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయని చెప్పారు. రాజకీయంగా మహారాష్ట్ర.. దేశంలో రెండో పెద్ద రాష్ట్రమని రేవంత్ అన్నారు. అలాంటి రాష్ట్రాన్ని ప్రధాని మోదీ.. కోవర్టు ఆపరేషన్లకు, విద్రోహాలకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. ముంబయిలోని ధారావిని కబ్జా చేసేందుకు మోదీకి గులాములు, ద్రోహులైన శిందే, అజిత్ పవార్, అశోక్ చవాన్‌లను వినియోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర నేల.. వీరుల నేల అని, ఈ విద్రోహులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెసలో విభేదాలనేవి బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ చేసే తప్పుడు ప్రచారమని రేవంత్ అన్నారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు

## బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం అరెస్ట్

### పోలీసులు తీరును ఖండించిన హరీష్ రావు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం దిలీప్‌ను సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ మీడియా హెడ్‌గా కొణతం దిలీప్ వ్యవహారించారు. అయితే గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్.. ఆ పదవి నుంచి తప్పుకున్నారు. నాటి నుంచి రేవంత్ సర్కారే లక్ష్యంగా ఆయన సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా రంగంలోకి దిగడంతోపాటు లగచర్ల ఘటనలపై దీనిని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఆ క్రమంలో చర్యలు చేపట్టింది. ఇలాంటి పోస్టులు పెట్టిన.. పెడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీలో కొణతం దిలీప్ సోషల్ మీడియా హెడ్‌గా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. మరోవైపు కొణతం దిలీప్ అరెస్ట్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. కొణతం దిలీప్ అరెస్ట్‌ను ఆయన ఖండించారు. కక్షపూరిత, ప్రతీకార చర్యలు మానుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ.. అప్రజాస్వామికంగా వ్యవహరించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు కొణతం దిలీప్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

# హామీల అమలులో రేవంత్‌రెడ్డి డకౌట్ : హరీశ్‌రావు




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి డకౌట్ అయ్యారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పేదోళ్ల ఇండ్లు కూలగొట్టడమే రేవంత్ హిట్ వికెట్ అని పేర్కొన్నారు. తుర్కయాంజల్ జేబీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గెలిచిన టీం కాదు, ఓడిపోయిన టీం కూడా బాగా ఆడారు. గెలుపోటములు చాలా సహజం. భవిష్యత్తులో గెలుపు కోసం పోరాటం చేయాలి. ఆరు గ్యారెంటీలు బంద్ పెట్టి మూసీ దుకాణం మొదలు పెట్టిండు రేవంత్ రెడ్డి. 31 ఎస్టీపీలు, రూ. 3800 కోట్లతో మూసీ అభివృద్ధిని కేసీఆర్ ప్రారంభించాడు. కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లను రూ. 1100 కోట్లతో మూసీలో పోయాలని ప్లాన్ చేశారు. మూసీ శుద్ధి చేయాలంటే గోదావరి నీళ్లు తేవాలి. అంతేగాని గరీబోళ్ల ఇల్లు కూలగొట్టడం కాదు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తా అంటే బీఆర్ఎస్ ఊరుకోదు అని హరీశ్‌రావు హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అన్నడు మోసం చేసిండు. పింఛన్లు, విద్య భరోసా కార్డు, ఉద్యోగాలు ఏవీ లేవు. ఇప్పటి వరకు ఒక్క విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్స్ డబ్బులు ఇవ్వలేదు. డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఏడాది అవుతున్నది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు రేవంత్ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసిన లగచర్ల బాధితులు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల ఫార్మా కంపెనీ బాధిత రైతు కుటుంబాల పోరాటం కొనసాగుతోంది. నిన్న ఢిల్లీకి చేరుకున్న బాధితులు సోమవారం ఉదయం జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిశారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో తమపై పోలీసులు జరిపిన దాడి గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు బాధితులు వివరించారు. పార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తే తమ వారిని అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, లగచర్ల బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలబడింది. జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసేందుకు లగచర్ల బాధితుల వెంట ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ మాలోతు కవిత, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు వెళ్లారు.

## ఆక్రమణలను కూల్చిన హైడ్రా



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు మళ్లీ కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం మరిన్ని కూల్చివేతలను మొదలుపెట్టాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో ఉన్న నిర్మాణాన్ని నేలమట్టం చేశాయి. భారీ యంత్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు అమీన్‌పూర్ పరిధిలోని పలు నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు సమీపంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కాగా, రహదారిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు హైడ్రా అధికారులు చెబుతున్నారు.

## కడియం శ్రీహరిని పర్వతగిరికి పంపించే వారకు నిద్రపోను : తాటికొండ రాజయ్య

**స్టేషన్ ఘన్‌పూర్ (క్రైమ్ మిర్రర్):** నియోజకవర్గంలో నువ్వైనా ఉండాలి.. నేనైనా ఉండాలని కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య స్పందించారు. కడియం సవాలును స్వీకరిస్తున్నానని చెబుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. కడియం శ్రీహరి స్థానికేతరుడు అని.. ఆయన్ను పర్వతగిరి పంపించే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో నువ్వో నేనో మిగలాలని కడియం శ్రీహరి అంటున్నాడని.. ఆయన ఎక్కడ కూడా తనకు పోటీ రాలేదని రాజయ్య అన్నారు. తాను వరుసగా నాలుగుసార్లు గెలిచానని గుర్తుచేశారు. కడియం శ్రీహరి ప్రజా నాయకుడు కాదని.. రాజకీయ నాయకుడు మాత్రమేనని విమర్శించారు. కడియం స్థానికేతరుడు అని.. ఆయన్ను తప్పకుండా తరిమికొడతానని అన్నారు. కడియం శ్రీహరి విసిరిన సవాలును స్వీకరిస్తున్నా అని తాటికొండ రాజయ్య అన్నారు. ' నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. ఇక్కడే ఉంటా.. రేపు ఛస్తే ఇక్కడే నన్ను బొంద పెడతారు. ' అని చెప్పారు. కానీ నిన్ను స్థానికేతరుడిలాగే గుర్తిస్తారని కడియం శ్రీహరిని ఉద్దేశించి రాజయ్య

# సొంత నియోజకవర్గంలోనే భూములు లాక్కున్నాడంటే

## సీఎం ఎంత దుర్మార్గుడో తెలుస్తుంది

## రైతుల జీవనాధారాన్ని గుంజుకుంటే ఏలా బతుకుతారు?

### మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



హైదరాబాద్, నవంబర్ 18 (ఆర్ఎన్ఎ): సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతున్న వారి జీవనాధారాన్ని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచకంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలోతు కవితతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. గత 9 నెలలుగా తమ భూములు ఇవ్వమని లగచర్ల రైతులు చెబూతునే ఉన్నారని సత్యవతి రాథోడ్ అన్నారు. భూములు తీసుకుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారని చెప్పారు. దాన్ని సాకుగా చూపి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అర్ధరాత్రి కరెంట్ తీసేసి, ఇంటర్ నెట్ బంద్ చేసి మహిళలను హింసించారని.. కొట్టారని.. బూతులు తిట్టారని అన్నారు. 51 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని.. ఊళ్లో ఉన్న మగవాళ్లంతా పారిపోయారని చెప్పారు. మళ్లీ ఏం చేస్తారోనని ఇప్పటికీ భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ధర్మ పోరాటానికి అండగా ఉండాలని రైతులు అన్ని పార్టీల నాయకులను కోరారని సత్యవతి రాథోడ్ తెలిపారు. బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికీ కూడా పోలీసులు గ్రామంలోకి వచ్చి ఇంకా అరెస్ట్ లు చేస్తున్నారని పేర్కొన్నారు. బాధితులకు ఉరి శిక్ష పడుతుందని రేవంత్ రెడ్డి సోదరుడు బెదిరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ భూములు గుంజుకుంటామని చెబుతున్నాడని మండిపడ్డారు. ఢిల్లీలో మాత్రమే న్యాయం జరుగుతుందని భావించి ఇక్కడకు వచ్చామని తెలిపారు. జాతీయ మానవహక్కుల కమిషన్ ను కలిసి పోలీసులు చేసిన అఘాయిత్యాలపై వివరించామని స్పష్టం చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ, మహిళ కమిషన్ ను కూడా కలుస్తామని వెల్లడించారు. న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని అన్నారు.. రాష్ట్రపతి కూడా ఆదివాసీ బిడ్డే అని.. ఆమె మాకు సమయం ఇస్తే వారికి కూడా ఈ సంఘటనను వివరిస్తాని తెలిపారు. కొద్ది రోజులుగా బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని అన్నారు. లగచర్ల బాధితులందరికీ బీఆర్ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు. తండ్రుల వారసత్వంగా వచ్చిన భూములను ఫార్మా కంపెనీ ఇవ్వాలని అంటున్నారని మాలోతు కవిత అన్నారు. ఫార్మా సిటీ కోసం గత ప్రభుత్వం ఇప్పటికే భూములు సేకరించిందని.. దాన్ని కాదని గిరిజనుల భూములను రేవంత్ రెడ్డి లాక్కుంటున్నాడని మండిపడ్డారు.

# ఫార్మా కంపెనీలపై సీఎంకు ఎందుకంత ప్రేమ

## జనాల కంటే మీకు ఫార్మా కంపెనీలే ముఖ్యమా..?

### పోలీసుల వైఫల్యంతో లగచర్ల ఘటన

### బాధితులతో ములాఖత్ అయిన బీజేపీ నాయకులు డీజే అరుణ, ఈటల రాజేందర్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఫార్మా కంపెనీలపై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమ అని బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న 16 మంది లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ ములాఖత్ అయ్యారు. అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ.. ఓటేసి గెలిపించిన జనాల కంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని నిలదీశారు. లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని రైతులు 8 నెలలుగా ఆందోళన చేస్తున్నారని ఎంపీ డీకే అరుణ అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని పేర్కొన్నారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే కలెక్టర్ ఒక్కరే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. పోలీసుల వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని డీకే అరుణ అన్నారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను భయపెట్టారని తెలిపారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని పేర్కొన్నారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వాళ్లను వదిలేసి మిగతా వాళ్లను అరెస్ట్ చేశారని అన్నారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వాళ్లను కలిసి మాట్లాడితే బాగుండేదని అన్నారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేపించి ఇలా చేయడం కరెక్టు కాదని స్పష్టం చేశారు. సీఎం సోదరుడు అక్కడికి వెళ్ళవచ్చు కానీ నన్ను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని డీకే అరుణ ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని తెలిపారు. మీరు సీఎం అయితే మా నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరు జనాలపై కక్ష కట్టారన్నారు. సీఎంకు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని నిలదీశారు. ఓటేసి గెలిపించిన జనాల కాంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. సీఎం కొడంగల్ వాసులు కాదు వలస వచ్చారని డీకే అరుణ తెలిపారు. మీకు నచ్చిన వారికి కంపెనీలు అప్పజెప్పడానికే ఫార్మా కంపెనీలు పెడుతున్నారని మండిపడ్డారు. వెంటనే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంథాలు వద్దని.. నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని అన్నారు. గర్భిణీ స్త్రీ అని చూడకుండా ఇలా చేయడం దారుణమని అన్నారు. సీఎం రేవంత్ అహంకారం వీడాలని.. ఒప్పించి భూములు తీసుకోవాలని సూచించారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావు నా ఫోన్ ట్యాప్ చేశారు

### పోలీసులకు ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌పై గతంలో డీజీపీకి, జూబ్లీహిల్స్ ఏసిపికి చక్రధర్ గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అలర్ట్ మెసేజ్ వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదుపై గతంలో రెండుసార్లు పోలీసులు విచారణ చేశారు. బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు తన ఫోన్ ట్యాప్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం మరోసారి విచారణకు రావాలని పోలీసులు ఆదేశించడంతో జూబ్లీహిల్స్ ఏసిపి ముందు చక్రధర్ గౌడ్ విచారణకు హాజరయ్యారు. ఆయన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులు పరిశీలించి విచారణ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్.. కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని, తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు ఆపిల్ కంపెనీ ద్వారా తనకు అలర్ట్ మెసేజ్ వచ్చిందని, దీనిపై గతంలో డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. గంటన్నర పాటు పోలీసులు విచారణ జరిపి.. స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారన్నారు. అప్పటి టాస్క్ ఫోర్స్ డిసిపి రాధా కిషన్ రావు బీఆర్ఎస్ పార్టీలో చేరి హరీష్ రావుకు సరెండర్ అవ్వాలని... లేకపోతే అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు దిగారన్నారు. తన వ్యక్తిగత ఫోన్‌తో పాటు తన భార్య, డ్రైవర్, తమ కుటుంబ సభ్యుల ఫోన్లు అన్ని ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చానని, మేము చెప్పినట్లు వినకపోతే తన కుటుంబాన్ని అంతం చేస్తామంటూ అప్పటి ట్రాన్స్‌పోర్టు డిసిపి రాధా కిషన్ రావు బెదిరింపులకు దిగారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌పై హైకోర్టులో పిటిషన్ వేసి పోరాటం చేస్తున్నానని, న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ వేసి పోరాటం చేస్తానని చక్రధర్ గౌడ్ స్పష్టం చేశారు. కాగా ఫోన్ టాపింగ్ కేసులో రాధాకృష్ణన్ రావు, భుజంగరావు బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరగనుంది.

## వేములవాడ అభివృద్ధి పనులకు రూ.127.65 కోట్లు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది. శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తుల సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం (÷ఉ ఉనీలసనిపనిబి) రూ.47.85 కోట్లు మంజూరు చేసింది. బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించింది.

## మియాపూర్‌లో అదృశ్యమైన యువతి

### తుక్కుగూడలో శవంగా గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నగరంలోని మియాపూర్‌లో అదృశ్యమైన అమ్మాయి (17) మృతదేహం లభ్యమైంది. తుక్కుగూడలోని ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ నెల 10న అమ్మాయి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సోమవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ఉప్పుగూడకు చెందిన ఓ యువకుడితో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాలో పరిచయం అయిన ఆ యువకుడే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు తుక్కుగూడలో అమ్మాయి మృతదేహం లభించినట్లు తెలిపారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టేక్ అంజయ్య నగర్ కు చెందిన 17ఏళ్ళ ఐశ్వర్య కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐశ్వర్యకు ఉప్పుగూడకు చెందిన ఓ యువకుడితో ఇన్స్టాగ్రామ్ లో పరిచయం ఉందని గుర్తించిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు మియాపూర్ పోలీసులు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption



## ఎడిటోరియల్



# తెలుగు చిత్రసీమలో ట్రెండ్ సెట్టర్

తెలుగు చిత్రసీమలో సూపర్‌స్టార్‌గా పేరున్న నటశేఖ కృష్ణ రణించి రెండేళ్లు పూర్తయ్యాయి. ఆయన ఓ ట్రెండ్ సెట్టర్‌గా పేరు సంపాదించారు. తెలుగు చలనచిత్ర సీమలో ఎందరో నటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, నిర్మాతలు తమదైన ముద్ర వేశారు. వారంతా చిత్రరంగం అభివృద్ధికి దోహదపడ్డారు. చిత్రరంగం నుంచి కూడా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు దక్కాయి. అనుబంధ రంగాల్లో ఎందరో ఉపాధి పొందు తున్నారు. ఇలా ఆనాటి నుంచినేటి వరకు చిత్రసీమ అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తోంది. ఈ క్రమంలో తమిళనాట స్థిరపడ్డ చిత్రరంగాన్ని హైదరాబాద్‌కు రప్పించే ప్రయత్నంలో అనేకానేకమంది కృషి చేశారు. ఆనాటి సిఎం చెన్నారెడ్డి పట్టుబట్టి వారిని హైదరాబాద్ రప్పించే ప్రయత్నం చేశారు. వారు ఇళ్లు కట్టుకోవడానికి, స్టూడియోలు కట్టుకోవడానికి స్థలాలు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ క్రమంలో చిత్రరంగంలో తనదైన ముద్ర వేసిన కృష్ణ కూడా హైదరాబాద్‌లో పద్మాలయా స్టూడియోస్ నిర్మాణం చేపట్టారు. అలాగే సినిమా రంగంలో ప్రత్యేకించి తనదైన ముద్రవేశారు. ఓ రకంగా చెప్పాలంటూ కృష్ణ సినిమా రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారు. ఇలా ఓతరానికి చెందిన నటుడిగా కృష్ణ నిలిచారు. అంతే గాకుండా అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడు. తొలి 70 ఎంఎం చిత్రం, తొలి జేమ్స్ బాండ్ చిత్రం, తొలి కౌబాయ్ చిత్రం, తొలి పుల్ స్కోప్ చిత్రం, తొలి ఈస్ట్ మాన్ కలర్, తొలి డీటీయస్ సినిమా.. ఇలా చెప్పుకుంటే పోతే కృష్ణ సినీప్రస్థానం లో ఎన్నో ప్రయోగాలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఇండిస్ట్రీలో నూతన ఒరవడికి ఆద్యుడిగా నిలిచిపోయారు. ఇవాళ ఈ ప్రయోగాలన్నీ కూడా చిత్రరంగంలో పెను మార్పులకు కారణం అయ్యాయి. ఎన్నెన్నో ప్రయోగాలకు తానే ముందు నిలిచిన కారణంగా మరెందరో కృష్ణను అనుకరించారు. అంతే గాకుండా ప్రత్యేకించి అభిమానులను సంపాదించుకున్నారు. ఇకపోతే కృష్ణలో మరో ప్రత్యేక గుణం ఉంది. సినిమా ప్రివ్యూ చూశాక అది ఆడుతుందో లేదో ఇట్టే చెప్పేశావారట. అందుకే మహేశ్ బాబు తన సినిమాల ఆడుతుందా లేదా అన్నది తండ్రి చెప్పాకనే విడుదల చేశారని అంటుంటారు. కృష్ణకు సినిమా నాడి బాగా తెలుసు. ఏ సమయంలో ఏ సినిమా తీస్తే ఆడుతుందో కూడా తెలుసు. ఎంచుకున్న కథలను కాలనుగుణంగా విడుదల చేసేవారు. ఎంచుకున్న కథలు, సినిమాల నిర్మాణంలో వేడం,ఎందరినో ఆదుకున్న మంచి మనసు కారణంగానే ఆయనొక సూపర్ స్టార్ కాగలిగారు. హీరో కృష్ణగా దాదాపు నాలుగు దశాబ్దాలు వెండితెరను ఏలినప్పటికీ ఎవరికీ ఎలాంటి పోటీ కాలేదు. తనకుతానే పోటీ అన్న విధంగా చిత్రరంగంలో ఎదిగారు. అలా కృష్ణ తెలుగు సినీ పరిశ్రమకు స్ఫూర్తిదాయక సేవలు అందించారనే చెప్పాలి. సూపర్‌స్టార్‌గా అభిమానుల గుండెల్లో చెరగని ముద్రవేసిన ఆయన సినీ ప్రస్థానం సాహసమే ఊపిరిగా.. ధైర్యమే ఆయుధంగా సాగింది. పౌరాణికం, సాంఘికం, జానపదం, జేమ్స్‌బాండ్ చిత్రాల్లోనే కాదు చారిత్రక నేపథ్య కలిగిన చిత్రాలను సైతం తెరకెక్కిం చారు. వెండితెరపై కృష్ణ సృష్టించిన సంచలనాలకు కొదవలేదు. చాలా తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేయడం కూడా కృష్ణకే చెల్లింది. అలా ఏడాదికి పదికి పైగా సినిమాలు చేసేవారు. ఒక ఏడాది 17 సినిమాల్లో నటించారు. 9 ఏళ్లలో అన్ని పాత్రలు కలుపుకుని 100 సినిమాలు చేశారు. వందవ సినిమాగా వచ్చిన 'అల్లూరి సీతారామరాజు' చలనచిత్రరంగంలో ఓ ప్రభంజనం సృష్టించింది. అప్పటివరకు కృష్ణ నటించిన చిత్రాలన్నీ ఒక ఎత్తయితే,ఈ సినిమా ఒక్కటీ మరో ఎత్తు. సంభాషణలు పలికే తీరు, హావభావాలు ప్రదర్శించే విధానం, ఆహార్యం వంటి విషయాల్లో ఆయన తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అశేష అభిమానులకు దగ్గర చేసింది. 'మోసగాళ్లకు మోసగాళ్లు'తో ఆ లోటును తీర్చేశారు కృష్ణ. అప్పట్లోనే ఈ చిత్రం పాన్ ఇండియా చిత్రంగా పలు భాషల్లో విడుదలైంది. ఇంగ్లీషులో సంచలనం సృష్టించిన మెకానస్ గోల్డ్ చిత్రం స్ఫూర్తితో దీనిని తెరకెక్కించిన తీరు ఇప్పటివీ వండరే. అప్పుడే ఈస్ట్‌మన్ కలర్‌లో దీనిని నిర్మించిన ఘనత కృష్ణకు మాత్రమే దక్కింది.ఇకపోతే గూఢచారి సినిమాలను కూడా తెలుగుసీమకు పరిచయం చేశారు. క్రైమ్ అండ్ థ్రిల్లర్ జోన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కృష్ణ సినిమాలు నిలిచేవి. అప్పటివరకు సాగుతున్న ఒరవడిని అధిగమించి తన సినిమాల్లో వైవిధ్యం చూపించేందుకు ఎంతటి సాహసమైనా చేసేవారు. అలా 'కొల్లేటి కాపురం' సినిమాతో తెలుగు తెరకు ఆర్.ఓ సాంకేతికతనకు పరిచయం చేశారు. 'గూడుపుఠాణి' చిత్రాన్ని మొదటి ఆర్ డబ్ల్యు కలర్‌తో తీశారు. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం 'భలే దొంగలు'. తొలి 70 ఎంఎం సినిమా 'సింహాసనం'. స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి సినిమా ఇది.



# ఢిల్లీ కాలుష్యంపై కొండంత నిర్లక్ష్యం

ఏటేటా ఢిల్లీ వాయుకాలుష్యంపై ఆందోళనలు, చర్చలు తప్ప పరిష్కారాలు మాత్రం చేయడం లేదు. ఎవరు దీనికికారణం. ఎవరు దీనిని నిరోధించాలన్న చర్చచేయడం లేదు. దేశరాజధాని పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా కేంద్రం కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. శాశ్వత చర్యలకు దిగడం లేదు. పదేళ్లుగా బిజెపి అధికారంలో ఉన్నా పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పెరుగుతున్న జనాభా,పట్టణీకరణ, ఉపాధి కోసం ఢిల్లీపై పడడం వంటి అనేక అంశాలు కూడా కారణం అవుతున్నాయి. ఢిల్లీలో వాయు కాలుష్యానికి మూలాలు బయట ఉన్నాయని నగర ప్రభుత్వం చెబుతోంది. ఆ బయటి మూలాలు ఏంటంటే పంట వ్యర్థాలను తగులబెట్టడం అన్నది తేల్చారు. ఏటా చలికాలం రాగానే ఢిల్లీ ప్రజలువాయుకాలుష్యం ప్రకటనలతో కలత చెందుతుంటారు. నగరంలో వాయు కాలుష్యం అత్యధిక స్థాయికి చేరే సమయమిదేనని తేలింది. ఈ భయంకర పరిస్థితులుకు కారణం ఏమిటి,కారకులు కారకులు ఎవరు అన్నది సకాలంలో గుర్తించి సమస్యను పరిష్కరించుకోవచ్చు. కానీ దీనిని నివారించే బదులు రాజకీయ నాయకులు పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్లనే కాలుష్యం వస్తుందన్న భావనలను ప్రచారం చేస్తున్నారు. ప్రతియేటా ఢిల్లీ కాలుష్యం గురించి చర్చించడం..దీపావళి ముందు పటాసులను కాల్చకుండా అడ్డు కోవడం.. పంట వ్యర్థాలను తగుటబెట్టవద్దని కొన్ని సూచనలు చేయడంతో సరిపెట్టడంతో ఢిల్లీ కాలుష్యాన్ని అరికట్టలేక పోతున్నాం. మనచేతుల్లో ఉన్న పనిని కూడా చేయలేక పోతున్నాం. కారణం కేవలం చేతకానితనం తప్ప మరోటి కాదు. గత కొద్ది సంవత్సరాలుగా ఈ వాయు కాలుష్య సమస్యను రూపుమాపే కార్యాచరణ సాగడం లేదు. దేశరాజధాని న్యూఢిల్లీ పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగతా పట్టణాల సంగతి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యగా చూడాలి. వాయు కాలుష్యానికి వాస్తవ కారణాలు ఏమిటో గుర్తించి వాటిని నివారించేందుకు చేపట్టవలసిన చర్యలను ఆచరించడం లేదు. గత నాలుగైదేళ్లుగా అక్టోబర్,నవంబర్ మాసాల వార్తలను పరిశీలిస్తే ఇది అర్థం కాగలదు. వివిధ విభాగాల అధికారులు తప్పు తమది కాదని, ఇతరులదని తప్పించుకో జూస్తున్నారు. ఇలా చేస్తే తమపైకి నిదం రాకుండా చూసుకుంటున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన అన్నది ఏటా జరిగే తంతుగా మారింది. ఢిల్లీలో కాలుష్య నివారణకు సరైన పరిష్కారాలను అన్వేషించాలని రెండేళ్లక్రితమే ఆనాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ సూచించారు. ఢిల్లీ, ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లో రైతులు పంటల వ్యర్థాలను పొలాల్లోనే తగులబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోందని, దీన్ని నివారించాలంటే పంట వ్యర్థాల కాల్చివేతపై పూర్తి నిషేధం విధించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఢిల్లీలో కాలుష్య నివారణకు పంటల వ్యర్థాల కాల్చివేతపై నిషేధం అత్యంత ప్రధానమైందని పలువురు పర్యావరణవేత్తలు కూడా పునరుద్ఘాటించారు. ఒక్క పంట వ్యర్థాలను కాల్చకుండా చూడడ మొక్కటే సమస్యకు పరిష్కారం కాదు. కాలుష్య నివారణకు వాస్తవ పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంది. ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వాలు శాస్త్రీయంగా,చిత్తశుద్ధితో ఆలోచిం చడం లేదు. 'ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది' గతంలోనూ అప్పటి సిజెఐ జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిజానికి కాలుష్యానికి కారకంగా ఉన్న సంస్థలూ వ్యవస్థలూ ఏవో మనకు స్పష్టంగా తెలుసు. ఏ రంగం ఎంతమేరకు ఈ వాయు కాలుష్యానికి కారణమవుతున్నదో కచ్చితమైన లెక్కలు ఉన్నాయి. అయితే ఈ రంగాలూ వాటి లెక్కలూ ఒక అధ్యయనానికీ, మరో అధ్యయనానికీ మారిపోతుంటాయి. ఏటేటా ఇదే తీరుగా ఉంది. నిజానికి ఒక్క పంటల కాల్చివేత వల్లనే

ఇంతగా కాలుష్యం వస్తుందని అనుకుంటే పొరపాటు. వాహన కాలుష్యం, ఫ్యాక్టరీలు, డీజిల్ జెనరేటర్లు, విద్యుత్కేంద్రాలు, గృహాలలో వంట కార్యకలాపాలు, రోడ్లపై దుమ్ము ధూళీ, భవన నిర్మాణం జరుగుతున్న ప్రదేశాలు మొదలైనవి కూడా వాయు కాలుష్యానికి కారణం అవుతున్నాయి. వీటిపై ఎవరు కూడా గట్టిగా మాట్లాడడం లేదు. దుమ్మూ ధూళి కాలుష్య కారకం కాదుకానీ విషపూరిత మైనది. ఎందుకంటే కంబస్టన్ ఉద్గారాలతో అది మిళితమవుతుంది. ఏటా ఉద్గారాలను నివారించేందుకు చేపట్టిన చర్యలేమిటిని ప్రశ్నించుకుంటే సున్నా.. వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పుడు కాలుష్యం స్థాయి పెరుగుతుంది. గాలి విషపూరితమవుతుంది. అలాగే నగరం నుంచి తరలించిన పరిశ్రమల సంఖ్య తక్కువేమీ కాదు. అయితే అవి ఇప్పటికీ బొగ్గు తదితర ఇంధనాలతో నడుస్తున్నందున వాటి కాలుష్యం కూడా బాగానే వస్తోంది. ఢిల్లీ శివారు ప్రాంతాలలో ఉన్న ఇలాంటి పరిశ్రమలు నగరంలో వాయు కాలుష్యానికి మరింతగా కారణమవుతున్నాయి. ఎండుగడ్డిని బొగ్గుకు బదులుగా ఇంధనంగా వినియోగించుకునే సుదూర ప్రదేశాల లోని పరిశ్రమలకు రవాణా చేసే వసతులు కూడా రైతులకు లేవు. ఎండుగడ్డిని విలువైనదిగా రైతులు పరిగణిచేందుకు చేయవలసింది చాలా ఉన్నది. అందుకు ఏడాది పొడుగునా నిర్ణయాత్మక చర్యలు ఎన్నో చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కాలుష్యంపై అనవసర, అర్థరహిత చర్చలు పక్కన పెట్టి సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన పటిష్ఠ చర్యలపై సంబంధిత అధికారులూ ప్రభుత్వ విభాగాలూ ప్రైవేట్ పరిశ్రమల వారూ దృష్టిని కేంద్రీకరిస్తే తప్ప ఇది తప్పించుకోలేని సమస్య. ఏటా ఇలాంటి వాదనలు రావడం, తరవాత మర్చి పోవడమూ జరుగుతుంది. దీనికి శాశ్వత, ఖచ్చితమైన పరిష్కారం దక్కాలంటే కఠిన నిర్ణయాలు అవసరం

# మళ్లీ బాబు బాదుడే బాదుడు


### ప్రజలు ఏం కొన్నా ఒక్క శాతం అదనపు ట్యాక్స్ కట్టాలి

### వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్

వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ మరోసారి ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా మళ్లీ బాబు బాదుడే బాదుడు అంటూ విమర్శించారు. ఎస్జీ ఎస్టీపై ఒక శాతం సర్ ఛార్జ్ విధించుకునే వెసులుబాటు ఇవ్వాలని కేంద్రానికి చంద్రబాబు వినతి పత్రం ఇవ్వడంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించడం అంటే ఇదేనా.. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోనే ఆయన నిజ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు అని ఎద్దేవా చేశారు. 2014- 19 పాలనకు మించి బాదుడే బాదుడు కార్యక్రమానికి పదును పెట్టారని సెటైర్ వేశారు. ఇప్పటికే కరెంట్ చార్జీలు పెంచి ప్రజలు నడ్డి విరిచారని మార్గాని భరత్ పేర్కొన్నారు.అలాగే, ప్రజలు ఏం కొన్నా 1 శాతం అదనపు ట్యాక్స్ కట్టాలి అని మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. అసలు సర్ ఛార్జ్ విధింపు ఎందుకోసం? ఎవరి కోసం? అని ప్రశ్నించారు. మీరు ఎన్నికల్లో ఏం చెప్పారు? నేను సంపద సృష్టిస్తా అన్నారా? లేదా? మరి ఆ సంపద ఎక్కడుంది?.. ఇంతకన్నా దారుణం ఏమైనా ఉందా?.. అసలు సర్ ఛార్జ్ రూపంలో వచ్చే డబ్బును ఎక్కడ ఖర్చు చేయాలని అనుకుంటున్నారు? అని అడిగారు. మీరు తెచ్చిన అప్పులు ఏమవుతున్నాయి?.. రూ.57 వేల కోట్లు ఏం చేశారు?.. ఎవరి జేబుల్లోకి ఆ డబ్బు వెళ్లింది? మీ ఐదారు నెలల పాలనలో చెప్పుకోదగ్గ ఒక్క స్కీం లేదని వైసీపీ మాజీ ఎంపీ భరత్ విమర్శించారు.ఇక, ఒక్క పనీ లేదు.. ఆ డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయి? అని మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రశ్నించారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ డ్.. రాష్ట్ర ప్రజలపై ఇప్పటికే రూ. 25 వేల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. మీరు చెప్పింది అబద్ధం కాదా?.. మీరు అడుగుతున్న సర్ ఛార్జ్ ని ఎవరి కోసం వాడాలనుకుంటున్నారు? అని అడిగారు. ప్రజలు చెల్లించే ప్రతి రూపాయి పైనా ఇది భారం అవుతుంది.. ప్రజలు భరించే డబ్బులు ఎవరి కోసం వాడాలనుకుంటున్నారు? అని క్వశ్చన్ చేశారు.

# కృష్ణుడు అంటే... ప్రేమతత్వం

కృష్ణుడి జీవితమే ఒక మానవ జీవన అనుభవసారం.. మూర్తీ భవించిన వ్యక్తిత్వ వికాసం..శ్రీకృష్ణుని రూపం నల్లనిది.. మనసు మాత్రం వెన్న పూసలా తెల్లనిది.. దేనికీ భయపడని వ్యక్తిత్వంతో చేపట్టిన ప్రతీ పనిలోనూ విజయం సాధించాడు.. నమ్మిన వారికి కొండంత అండగా నిలిచాడు. అసలు కృష్ణుడంటేనే అలౌకిక ఆనందానికి ప్రతిరూపం.. సచ్చిదానంద రూపం.. సత్‌చిత్ ఆనంద స్వరూపం.. పాపాల్ని నాశనం చేసేదే కృష్ణ తత్వం.. కృష్ణుడి పేరు తలుచుకుంటేనే అమరత్వం సిద్ధిస్తుంది.. జవసత్వాలు ఉట్టి పడతాయి.. కృష్ణ నామం కర్ణపేయంగా ఉంటుంది... పురాణాలలోను, తాత్త్విక గ్రంథాల లోను, జనబాహుళ్యంలోని గాథలలోను, సాహిత్యంలోను, ఆచార పూజా సాంప్రదాయాలలోను కృష్ణుని అనేక విధాలుగా భావిస్తుంటారు, చిత్రీకరిస్తుంటారు. చిలిపి చెపుతుంటారు మన పెద్దలు. తన భక్తుల మనసులోని ఆజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును నింపడం కోసమే కన్నయ్య వెన్న తినేవాడు.అంతా క్రిష్ణమయం... కృష్ణ తత్వం చదివిన వారికి నిజమైన ప్రేమ తత్వం తెలుస్తుంది. కాలానికి ప్రతీకగా శ్రీకృష్ణుడు నెమలి పింఛాన్ని ధరిస్తాడు...కన్నయ్య వేణువును విడిచిపెట్టి క్షణం కూడా ఉండలేడు. వేణువు, మాధవుల అనుబంధం ఎంత గొప్పదంటే...చివరకు గోపికలు కూడా వేణువును చూసి అసూయపొందారు. కన్నయ్య తమ కన్నా వేణువునే ఎక్కువగా ఆదరిస్తున్నాడని అలిగారు. వాళ్ళందరు కలిసి వేణువుని అడిగితే ఇలా అందట... 'నన్ను నేను గోపయ్యకు అర్పించుకున్నాను. నాలో ఏమీ లేదు. అంతా డొల్ల' అంది. నిజమే! వేణువు అంతా శూన్యం. అంటే, పరిపూర్ణతకు చిహ్నం. మానవుడు అందుకోవాల్సిన



బాలునిగాను, పశువులకాపరిగాను, రాధా గోపికా మనోహరునిగాను, రుక్మిణీ సత్యభామాది అష్టమహిషుల ప్రభువుగాను, గోపికల మనసు దొచుకున్న వాడిగాను, యాదవరాజుగాను, అర్జునుని సారథియైన పాండవ పక్షపాతిగాను, భగవద్గీతా ప్రబోధకునిగాను, తత్త్వోపదేశకునిగాను, దేవదేవునిగాను, చారిత్రిక రాజనీతిజ్ఞునిగాను ఇలా బహువిధాలుగా శ్రీకృష్ణుని రూపం, వ్యక్తిత్వం, దైవత్వం చిత్రీకరింపబడినాయి. కాని ఆ శ్రీకృష్ణుని గురించి ఇంకా ఎన్నో విశేషాలు తెలుసుకోవలసినవి మిగిలిపోతూనే ఉంటాయి, ఉన్నాయి.వెన్న ముద్దల దొంగ...ఈ బాలకృష్ణుడు ఇంటింటా తన స్నేహితులతో వెన్న ముద్దలు దొంగిలిస్తూ వెన్న దొంగగా ముద్రవేసుకున్నాడు. అలా వెన్న ముద్దల దొంగతనంలో మానవులకు అందని దేవరహస్యం ఉందట. వెన్న జ్ఞానానికి సంకేతంగా మహత్తరమైన ఆధ్యాత్మిక సందేశాన్ని వేణువు అందిస్తుంది. నేను, నాది అనే వాటికి మనిషి దూరం కావాలి. తాను తానుగా మిగలాలి. తన స్వచ్ఛమైన మనస్సును మాధవుడికి అర్పించాలి. అలాంటి మనసున్న మనుషుల్ని పరమాత్మ అక్కున చేర్చుకుంటాడు. వ్యాసమహర్షి శ్రీభాగవతంలో రుతువర్ణన చేస్తూ...'కృష్ణమేఘం' అన్న మాట వాడారు. ఆ మేఘం వెంట వచ్చే మెరుపు కృష్ణయ్య చిరునవ్వేనట! మధురాధిపతే అఖిలం మధురం! కృష్ణుడు మధురకే కాదు, ప్రేమ మాధుర్యానికీ అధిపతి. మొత్తం మీద చెప్పాలంటే శ్రీకృష్ణుడు అంటే ఆనందతత్వం ప్రేమతత్వం స్నేహతత్వం ప్రకృతితత్వం నాయకత్వం నీవే తల్లివి దండ్రివి నీవే నా తోడు నీడ! నీవే సఖుడౌనీవే గురుడవు దైవమునీవే నా పతియు గతియు! నిజముగ కృష్ణా..

# మణికొండ రెడ్డి ఫౌండేషన్కు ఐదు లక్షల చేయూత





CONTINENTAL HEALTH FOUNDATION

To,
Manikonda Reddy Foundation

13-11-2024

Dear President,

Sub: Providing financial assistance of Rs.5,00,000/- —Reg
Ref: Your letter dated Nov 8, 2024

We are pleased to know about your foundation's objectives and thriving for uplift of down trodden promoting education career to poor and needy.

Referring to your letter cited, we are pleased to donate Rs.5,00,000/- (Rupees Five Lakhs only) financial assistance towards meeting the objectives of your esteemed foundation.

Request you to acknowledge the receipt with all registrations/tax exemption certificates for our records.

Best wishes
For Continental Health Foundation

Dr. Guru N Reddy
Chairman

గండిపేట్(క్రైం మిర్రర్): ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తోడ్పాటు అందించాలని కాంటినెంటల్ హాస్పిటలీ చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. మణికొండరెడ్డి ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాలను గుర్తించి కాంటినెంటల్ హెల్త్ ఫౌండేషన్ ద్వారా ఐదు లక్షల రూపాయల చేయూతను అందజేశారు. ఈ విరాళాన్ని మణికొండ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలలోని ఉత్తమ విద్యార్థుల చదువుకు ఉపయోగించాలని సూచించారు. అంతేకాకుండా ఫౌండేషన్ గుర్తించిన విద్యార్థులకు స్కూల్ పుస్తకాలు, దుస్తులు, స్కూల్ బ్యాగులు నిమిత్తం ఇంకా విరాళాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ ఎక్విప్మెంట్ వారి చదువు నిమిత్తం ఇస్తామని తెలిపారు. మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు కాంటినెంటల్ హాస్పిటల్ ద్వారా గోల్డ్ హెల్త్ కార్డు ద్వార డిస్కౌంట్స్ రూపంలో వారికి తక్కువ ఖర్చుతో, పరిపూర్ణమైన వైద్యం అందించడం జరుగుతునద్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కూచికుల్ల నరేందర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్రెడ్డి, శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్రెడ్డి, బాల్రెడ్డి, సుభాష్చంద్రరెడ్డి, కృపాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశన్నికి వస్తున్నటీపీసీసి చీఫ్ కు ఓఆర్ఆర్ (ముత్తంగీ) వద్ద ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నేత చిన్న ముదిరాజు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18:(క్రైమ్ మిర్రర్):** పటాన్ చెరువు ముత్తంగి ఓ ఆర్ ఆర్ వద్ద టీపీసీసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా తీసుకుని ఇస్నాపూర్ గుండా సంగారెడ్డి లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత సభకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో అన్ని చోట్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి పనిచేసి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తం అని హామీ ఇచ్చారు.



## లక్ష్మిగూడలో పేలుడు కలకలం దేవాలయం ప్రాంతంలో చెత్త, గడ్డిని చదును చేస్తుండగా గుర్తు తెలియని పరికరం బ్లాస్ట్. ఘటనలో గాయాలకు గురైన పూజారి.





**గండిపేట్(క్రైం మిర్రర్):** దేవాలయం ఆవరణలో పెరిగిన గడ్డి, చెత్తను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని పరికరం పేలడంతో పూజారికి తీవ్ర గాయాలైన సంఘటన మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన స్థలాన్ని రాజేంద్రనగర్ ఏసీపీ టి. శ్రీనివాస్, డీసీపీ సి. హెచ్.శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ పి.నరేందర్లు పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మిగూడలో శ్రీ శ్రీయాదే మాత మందిరం ఉంది. ఇందులో సుగుణరామ్ పూజారిగా ఉన్నారు. దేవాలయం ఆవరణలో పెరిగిన గడ్డిని, చెత్తను పారతో చదును చేస్తున్నాడు. ఆకస్మాత్తుగా గుర్తు తెలియని పరికరం పేలింది. ఈ ఘటనలో సుగుణరామ్కు తలకు, శరీరానికి తీవ్ర గాయాలైయ్యాయి. గాయాలైన సుగుణరామ్ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు క్లూస్ టీమ్ను రప్పించి తనిఖీ చేయించారు. ఎలాంటి ఆనవాలు లభించలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ ఎస్ పార్టీకి ఆకర్షితులమయ్యాం

### మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు పి.మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరీఫ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు కుంభగళ్ల ధనరాజ్ లు





**గండిపేట్, (క్రైం మిర్రర్) :** కాంగ్రెస్ పార్టీని వీడి భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరిన మణికొండ నాయకులను ఉద్దేశించి వారు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ లేరని చెప్పడం విడ్డూరమని మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు పి.మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరీఫ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు కుంభగళ్ల ధనరాజ్ లు అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పి.మల్యాద్రి నాయుడు మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసి అప్పటి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఇప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పార్టీ తరపున జిల్లా ఉప కార్యదర్శి పదవిని కట్టబెట్టడం అందరికి తెలిసిందేనని గుర్తు చేశారు. ఇప్పటి నుంచి మైనారిటీ నాయకుడు షేక్ ఆరిఫ్ గత పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక కౌన్సిలర్ కే.రామకృష్ణా రెడ్డితో కలిసి బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఇద్దరు కాంగ్రెస్ పార్టీని వీడి తిరిగి బి.ఆర్.ఎస్ పార్టీలో చేరడం నిజమని, ప్రస్తుత కాలంలో భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ముందుకు సాగుతూ పనిచేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ ప్రజా పక్షాన నిలిచిందని, కాంగ్రెస్ పార్టీని పలువురు నాయకులు, కార్యకర్తలు వీడి ముఖ్యంగా మైనారిటీలు బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరుగుతున్న వాస్తవమని తెలిపారు. ఇక నిధుల లేమి గురించి గత ప్రభుత్వం సహకరించలేదన్న నెపం మోపిన విషయమై, మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆదీనంలో ఉండగా ఎందుకు గడచిన 4 సంవత్సరాల 10 నెలల కాలంలో కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాలపై చర్చించలేదన్నారు. ఇప్పటికైనా మించి పోయింది లేదని, కౌన్సిల్ సమయం ముగిసేలోపు కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం లేవనెత్తిన ప్రశ్నలను కౌన్సిల్లో చర్చించి తీర్మానం చేయాలని కోరారు.

# కాంగ్రెస్‌లో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువే

### జనవరిలో పదవుల పందేరం

### స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

### కార్యకర్తలకు పిసిసి చీఫ్ మహేశ్ సూచన

**సంగారెడ్డి,(క్రైం మిర్రర్) :** కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో లేదని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ ని వ్యతిరేకించిన అది పార్టీ కోసమే కానీ వ్యక్తిగతం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొంత నారాజ్ ఉన్నారని.. తాము మీకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మన ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు వివరించాలని సూచించారు.సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం సందర్భంగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. జనవరిలో కొంతమంది పార్టీ నాయకులకు పదవులు ఇస్తామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటాలని అన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలల్లోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీపై కుట్ర పన్నుతున్నా యన్నారు. కార్యకర్త కూడా సీఎంను కలిసే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు నారాజ్ అయితే తాము కుర్చీ దిగాల్సిందేనన్నారు. మరోసారి మనం అధికారంలోకి రావాలి.. ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి అని కామెంట్స్ చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆగం చేస్తే కాంగ్రెస్ పార్టీ రిపేర్లు చేస్తుందన్నారు. బంగారు తెలంగాణ అంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయం అయ్యిందని సెటైర్లు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీటలు బారుతున్నాయని.. కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టు 70 ఏళ్లయిన చెక్కు చెదరలేదని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుకి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. మీరు పదేళ్లలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పండి.



# ఆర్భాటంగా ముగిసిన దంగల్

### టైటిల్ విజేతగా సుస్మిత్ పైల్వాన్.

గండిపేట్(క్రైం మిర్రర్): అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానం కేంద్రంగా ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. ఈ 6వ కుస్తీ పోటీలలో టైటిల్ బహుమతిని సుస్మిత్ పహిల్వాన్ కైవసం చేసుకున్నారు. రెండవ విజేతగా సాంకేత్ పహిల్వాన్, మూడవ బహుమతి మహేందర్ విజేతలుగా నిలిచారు. బాలకేసరి విజేతగా సాయిదర్శన్‌యాదవ్, మూడవ బహుమతి గౌరవ్ గెలుపొందారు. కార్తీక ఉమెన్ కేసరి విజేతగా నిలిచారు. ఈ కుస్తీ పోటీల కమిటి చైర్మన్ బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్ నారగూడెం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గొరిగే రాజు పైల్వాన్ అధ్యక్షతన కమిటి సభ్యులు విజయ్ రౌత్, గురులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అధ్యక్షుడు యాదయ్యముదిరాజ్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, సంతోష్ పైల్వాన్, బోట్రాజ్ పైల్వాన్, అభిమన్యు పైల్వాన్, సీనియర్ జర్నలిస్టు మేడం మధుసుధన్, నాయకులు మల్లేష్‌యాదవ్, నల్లింగ్ రమేష్, ఎస్.జయానంద్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కొలన్ జైపాల్‌రెడ్డి, సత్యం, అత్తాపూర్ సీఐ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలి

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర





**గండిపేట్(క్రైం మిర్రర్):** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యుమరేషన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశలించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ పరిధిలోని 9వ డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీ, శ్రీకృష్ణానగర్ కాలనీ, ఫ్రీడం విల్లాస్, ఫార్చ్యూన్ మీడోస్‌లలో పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

గండిపేట్(క్రైం మిర్రర్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. సంబంధిత శాఖల అధికారులకు వీటిని పంపించామన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలి: ఎంపీడీకే అరుణ





**సంగారెడ్డి ,నవంబర్ 18 (క్రైమ్ మిర్రర్):** శాంతి భద్రతల వైఫల్యం వల్లే వికారాబాద్ జిల్లాలో లగచర్ల ఘటన జరిగిందని బిజెపి ఎంపి డీకే అరుణ అన్నారు. లగచర్ల కంపెనీకి భూసేకరణ కోసం రైతులు నిరాకరించారని ఆమె చెప్పారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసులో అరెస్టు అయి సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న 16 మందితో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ తో కలిసి డీకే అరుణ ములాఖత్ అయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ వద్దని గత 8 నెలలుగా రైతులు దీక్షలు చేస్తున్నారని.. కానీ, రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడానికి యత్నించారని ఎంపీ ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజావేదికను గ్రామస్థులు బహిష్కరించారని తెలిపారు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం లేకుండా కలెక్టర్ ఒక్కరే గ్రామానికి వెళ్లారని.. అక్కడికి వచ్చిన కలెక్టర్‌ను గో బ్యాక్ అని ప్రజలు నిరసన తెలిపారని చెప్పారు. ఈ క్రమంలోనే ఘటన చోటుచేసుకుందని ఎంపీ డీకే అరుణ అన్నారు.లగచర్ల ఘటన తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తోంది. తాజాగా ఈ అంశంపై డీకే అరుణ మాట్లాడుతూ, లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని గత 8 నెలలుగా గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని, ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరుడు అక్కడున్న రైతులను భయపెట్టారని, ఎలాగైనా భూములను గుంజుకుంటామని చెప్పారని మండిపడ్డారు. కలెక్టర్ పై దాడి ఘటన తర్వాత గ్రామాల్లోకి వచ్చిన పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది కొడంగల్ కాదని... వారు వలస వచ్చారని డీకే అరుణ చెప్పారు. రేవంత్ రెడ్డి సీఎం అయితే తమ నియోజకవర్గం బాగుంటుందని ప్రజలు గెలిపిస్తే... ఆయనేమో జనాలపై కక్ష కట్టారని దుయ్యబట్టారు. లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంతాలకు పోవద్దని, ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని సూచించారు. పేదల ఉసురు పోసుకున్న కేసీఆర్ ఇంటికి పోయారని... 11 నెలల సమయంలోనే మీరు పేదల ఉసురు పోసుకుంటున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి అహంకారాన్ని వీడాలని చెప్పారు. రైతులను ఒప్పించిన తర్వాతే భూములు తీసుకోవాలని అన్నారు.



## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి పరుస్తున్నాం

### రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట్(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పృరిధిలోని దుర్గానగర్, లక్ష్మిగూడ, బృందావన్ కాలనీలలో స్థానికుల విజ్ఞప్తి మేరకు నూతన సీసీ రోడ్లు, నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనుల నిర్మాణానికి బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో పర్యటిస్తూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసున్నారు. త్రాగునీరు కోసం, నూతన వీధి దీపాలు, బస్తీలోని సమస్యల గురించి స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జనార్ధన్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ్మామూర్తి, జలమండలి మేనేజర్ రేణుక, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జియా వినయ్, జనార్ధన్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, హనుమంత్‌రెడ్డి, ధనరాజ్, సతీష్, రంజిత్, బస్తీలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**గండిపేట్, (క్రైం మిర్రర్) :** పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ లు వరమని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. నార్సింగి గ్రామానికి చెందిన లలిత, సోని, జుబేదా కి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్థానిక కౌన్సిలర్ ఉషారాణితో కలిసి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించి వారిని ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతుందని వివరించారు. ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇస్తూ ఎంతో మంది పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం తో పాటు వారి ప్రాణాలను కాపాడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లాభాల బాటలో శ్రేష్ఠ ఫిన్ వెస్ట్

### త్రైమాసిక ఫలితాలు విడుదల

Srestha Finvest Limited

**క్రైమ్ మిర్రర్ :** హైదరాబాద్: శ్రేష్ఠ ఫిన్ వెస్ట్ లిమిటెడ్ కంపెనీ త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. 2024 సెప్టెంబర్ 30తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి హాఫ్ (ఎచ్ 1ఎఫ్ వై 25) వృద్ధి మరియు అర్ధ వార్షిక రాబడులపై సమాచారం ప్రకటించింది. 2024 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో (క్యూ 2 ఎఫ్ వై 25), ఆపరేషన్ల నుంచి ఆర్జించిన ఆదాయం 70.31% పెరిగి %=o%. 357.98 లక్షలకు చేరుకున్నది, 2023 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో ఇది %=o%. 210.21 లక్షలు. ఎచ్ 1ఎఫ్ వై 25లో, సంస్థ ఆపరేషనల్ ఆదాయం 883.51% పెరిగి %=o%. 4307.99 లక్షలుగా నమోదైంది, గత ఆర్థిక సంవత్సరంలో (ఎచ్ 1ఎఫ్ వై 24) ఇది రూ. 438.02 లక్షలుగా ఉన్నది. ఈ సందర్భంగా, షేర్ల కల్పన ద్వారా రూ. 100 కోట్ల వరకు నిధులు సమకూర్చుకోవాలని బోర్డు ఆమోదించింది.



## జన్మదిన వేడుకలో ప్రగతి నగర్ నాయకులు

**నిజాంపేట్, క్రైం మిర్రర్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని రఘుపతి కౌంటి కి చెందిన శ్రీకాంత్ కుమారుడు జగత్ విక్యత్ ప్రధమ జన్మదిన వేడుకల్లో ప్రగతి నగర్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ నాయకులు బోట్ల తిరుపతి, తుమ్మేటి శరత్ రెడ్డి, ధార్కోల్ శ్రీనివాసరావు, సందీప్, వేముల శ్రీనివాస్, శ్రీ సాయి గౌడ్, తోట శ్రీకాంత్ పటేల్, తిరుమలేష్, సంపత్, మోతిరం, శరత్, వేణు, విజయ భాస్కర్ రెడ్డి, రమేష్, రాంపుల్లారెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన దరిద్రం

### ఓటేసి గెలిపించిన ప్రజలపై కక్ష కట్టారు

అందుకే ఫార్మా కంపెనీపై ప్రేమను ప్రదర్శిస్తున్నాడు

రేవంత్..దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలువు : డీకే అరుణ

లగచర్ల బాధితులను పరామర్శించకుండా మొయినాబాద్ లో ఎంపీలు డీకే అరుణ,ఈటెల అరెస్ట్

పోలీసుల తీరుపై మండిపడ్డ ఎంపీలు,బీజేపీ శ్రేణులు



చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన దరిద్రమని ఎంపీలు డీకే అరుణ,ఈటెల అన్నారు.వికారాబాద్ జిల్లాలోని లగచర్ల బాధితులను పరామర్శించెందుకు సోమవారం ఎంపీలు డీకే అరుణ,ఈటెల వెళ్లేక్రమంలో..మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ముందు పోలీసులు వారిని అరెస్ట్ చేసి నార్సింగి పోలీస్ స్టేషన్ కు తరలించారు.అంతకు ముందు వారు మాట్లాడుతూ..ప్రజాపాలన అంటూ చెప్పుకునే ప్రభుత్వ పాలనలో కనీసం ప్రజల పక్షాన నిలబడే స్వేచ్ఛ కూడా లేకుండా ప్రజాస్వామ్యానికి సమాధి కడుతున్నారని మండిపడ్డారు.లగచర్ల గ్రామంలో గత 8నెలలుగా తాము భూమి ఇవ్వమని ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి ఫార్మా కంపెనీపై ఎక్కడ లేని ప్రేమను చూపుతూ సొంత నియోజకవర్గం ప్రజలపై కక్ష కట్టారని కన్నెర్ర చేశారు.సీఎం రేవంత్ దమ్ముంటే రాజీనామా చేసి తిరిగి గెలవాలని సవాల్ విసిరారు.నన్ను ఓటేసి గెలిపించుకున్న నా సొంత నియోజకవర్గం ప్రజల వద్దకు వెళ్లకుండా అడ్డుకుంటారా..?అంటూ పోలిసులపై ఆమె ఫైర్ అయ్యారు.అనంతరం పోలీసులు ఎంపీలను అరెస్ట్ చేయడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం మధ్య జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.ఎంపీల అరెస్టులను నిరసిస్తూ రేవంత్ రాజ్యం,పోలీస్ రాజ్యం నశించాలని బీజేపీ శ్రేణులు నినాదాలు చేశారు.



## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి నీలం మధు తేనీటి విందు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18(క్రైమ్ మిర్రర్):** టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ తేనీటి విందు ఇచ్చారు. సంగారెడ్డిలో ముఖ్య కార్యకర్తల సమావేశం ముగించుకొని హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో నీలం మధు అభ్యర్ధన మేరకు టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సాయంత్రం చిట్కుల్ లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం ప్రాంగణమంతా కలియతిరిగి పరిశీలించారు. ప్రాంగణంలో ఉన్న నీలం మధు తల్లిదండ్రులైన స్వర్గీయ నీలం రాధ నిర్మల్ జ్ఞాపకార్థం నిర్మించిన వారి కాంస్య విగ్రహాలకు నివాళులర్పించారు. అక్కడే ఉన్న గోమాతకి గడ్డి తినిపించి నమస్కరించారు. అనంతరం నీలం మధు కార్యాలయంలో తేనెటీని సేవించి హైదరాబాద్ కు పయనమయ్యారు.

## అయ్యప్ప స్వామి మహాపడిపూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఈ నెల 20 వ తేదీన ఘనంగా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి హాజరు కావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కోరారు. ఈ మేరకు నిర్వాహకులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ మహాపడిపూజ కార్యక్రమాన్ని లాలమ్మ గార్డెన్స్ లో దిలీప్ సూపర్ మార్కెట్ వద్ద జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, ముత్యాలు, మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## సీజన్: ఎంతమంది వెహికల్స్ కొన్నారో తెలుసా?

భారతదేశంలో మొత్తం పండుగ సీజన్‌లో 42 లక్షల యూనిట్ల కంటే ఎక్కువ వాహనాలు అమ్ముడయ్యాయి. ఇందులో టూ వీలర్స్, ఫోర్ వీలర్స్, త్రీ వీలర్స్ అన్నీ ఉన్నాయి. 2023 ఇదే పండుగ సీజన్‌లో అమ్ముడైన మొత్తం వాహనాలు 38.37 లక్షల యూనిట్లు. దీన్ని బట్టి చూస్తే.. ఈ ఏడాది ఫెస్టివల్ సీజన్‌లో వాహన విక్రయాలు పెరిగినట్లు తెలుస్తోంది. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ 2024 పండుగ సీజన్‌లో 45 లక్షల యూనిట్ల వాహనాలు అమ్ముడవుతాయని అంచనా వేసింది. అయితే ఊహించిన అమ్మకాలు జరగలేదు, కానీ 2023 కంటే 2024లో సేల్స్ ఉత్తమంగానే ఉన్నాయని స్పష్టమవుతోంది. 2023లో ద్విచక్ర వాహనాల సేల్స్ 29.10 లక్షల యూనిట్లు కాగా.. 2024లో 33.11 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. అంటే ఈ ఏడాది అమ్మకాలు 13.8 శాతం వృద్ధి చెందాయి. త్రీ వీలర్స్ సెల్స్ 2023లో 1.50 లక్షల యూనిట్లు.. 2024లో 6.8 శాతం పెరిగి 1.60 లక్షల యూనిట్లకు చేరింది. కమర్షియల్ వాహన విక్రయాలు 2023లో 1.27 లక్షల యూనిట్లు.. కాగా 2024లో 1.29 లక్షల యూనిట్లు. ఈ విభాగంలో అమ్మకాలు 1 శాతం పెరిగింది. ప్యాసింజర్ వాహన సేల్స్ 2023లో 5.63 లక్షల యూనిట్లు, 2024లో 6.03 లక్షల యూనిట్లు. ఇలా మొత్తం మీద 2024లో మొత్తం వాహనాల సేల్స్ 42 లక్షల యూనిట్లను అధిగమించింది.

## కార్ల విక్రయాల్లో మారుతి టాప్

**అత్యధికంగా అమ్ముడైన బ్రాండ్లలో ఆరు కంపెనీయే**




న్యూఢిల్లీ, నవంబర్ 16 : దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ దూసుకుపోతున్నది. గత నెలలో దేశీయంగా అమ్ముడైన టాప్-10 వాహనాల్లో ఆరు బ్రాండ్లు మారుతికి చెందినవే కావడం విశేషం. గత కొన్ని నెలలుగా అమ్మకాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలకు గత పండుగ సీజన్ కిక్కునిచ్చింది. నిర్వహణ ఖర్చులు పెరిగినాయంటూ ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచుతుండటంతో కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ గత నెలలో అమ్ముడైన మొత్తం వాహనాల్లో మారుతికి చెందిన వాహనాలకు పెద్దపీట వేశారు. అలాగే హ్యుందాయ్, మహీంద్రా, టాటాలకు చెందిన బ్రాండ్లకు కూడా మద్దతు లభించింది.

## బోయింగ్ తొలగింపులు.. 400మందికి పైగా ఉద్యోగులకు లేఆఫ్ నోటీసులు




అమెరికాకు చెందిన ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. అందులో భాగంగా తాజాగా 400 మందికి పైగా ఉద్యోగులకు లేఆఫ్ నోటీసులు జారీ చేసింది. కార్మికులు సమ్మె చేయడంతో వాటిల్లిన నష్టం పూడ్చుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడులు, ఉత్పత్తి ఆలస్యం వేళ బోయింగ్ లేఆఫ్‌ల నిర్ణయం తీసుకుంది. ఏరోస్పేస్ లేబర్ యూనియన్‌లోని 438 మంది ఉద్యోగులకు లేఆఫ్ నోటీసులను అందించింది. వీరిలో 218 మంది ఇంజినీర్లు, సొసైటీ ఆఫ్ ప్రొఫెషనల్ ఇంజినీరింగ్ ఎంప్లాయిస్ ఇన్ ఏరోస్పేస్ (%ూాజుజూా%) యూనిట్‌లోని సభ్యులుకాగా.. మిగిలిన వారు టెక్నికల్ యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న వాళ్లు, సాంకేతికత నిపుణులు, విశ్లేషకులు ఉన్నారు. అయితే అర్హత కలిగిన ఉద్యోగులకు మూడు నెలల వరకు కెరీర్ ట్రాన్సిషన్ సేవలు, ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు అందించనుంది.

**10 ఏళ్లలో లక్ష కోట్ల డాలర్ల లాభాలు**

సియాటెల్ ప్రాంతంలో 33 వేల మంది కార్మికులు కొన్ని వారాల పాటు సమ్మె చేశారు. దీంతో 737 %మీూాశ%, 767, 777 జెట్‌ల ఉత్పత్తి నిలిచిపోయింది. సమ్మె కారణంగా మూడో త్రైమాసికంలో 5 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని సంస్థ తెలిపింది. ఈ నష్టాలను పూడ్చుకొనేందుకు ఉద్యోగుల తొలగింపును మార్గంగా ఎంచుకుంది.

# మోసాల బారిన పడటంలో ఉద్యోగార్థులూ బాధ్యులే

**జీనియస్ కన్సల్టెంట్స్ సర్వే వెల్లడి**



ముంబయి: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరుగుతున్న మోసాల బారిన పడటంలో ఉద్యోగార్థులు కూడా బాధ్యులేనని ఓ సర్వేలో 75 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం లేదా చెల్లింపులు చేయడానికి ముందు కంపెనీ వివరాలను వాళ్లు పూర్తి స్థాయిలో పరిశీలించకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. మానవ వనరుల సేవల సంస్థ జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం..కంపెనీలు లేదా నియామక సంస్థలమని చెబుతూ కొందరు చేస్తున్న మోసాల విషయంలో ఉద్యోగార్థులు అవసరమైన అప్రమత్తతను పాటించడంలో విఫలమవుతున్నారని 75 శాతం మంది ఉద్యోగులు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరుగుతున్న మోసాల నియంత్రణకు ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు పలు కఠిన చర్యలు చేపట్టినట్లుగా తాము భావిస్తున్నట్లు 28 శాతం మంది చెప్పగా.. 55 శాతం మంది ఈ అభిప్రాయంతో విభేదిస్తూ మోసాల నియంత్రణకు ప్రస్తుతమున్న చర్యలు సరిపోవట్లేదని వెల్లడించారు. ఉనికిలో లేని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేలా ఉద్యోగార్థులను తప్పుదోవ పట్టించే నకిలీ ఉద్యోగ ప్రకటనల అనుభవం తమకు ఎదురైందని 70 శాతం మంది తెలిపారు. ఉద్యోగార్థుల నమ్మకాన్ని సొమ్ము చేసుకోవాలని చూస్తున్న నకిలీ నియామక సంస్థలు తమకు ఎదురయ్యాయని 26 శాతం మంది చెప్పారు. ఉద్యోగం ఇప్పించేందుకు కొందరు మోసగాళ్లు డబ్బులు అడుగుతుండటంతో బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన వివరాలను పంచుకోవడం ద్వారా డబ్బుల రూపేణా మోసపోయినట్లు 3 శాతం మంది వెల్లడించగా.. తమ వ్యక్తిగత సమాచార చౌర్యం జరిగినట్లు 1 శాతం మంది తెలిపారు. ఐటీ రంగంలో నిపుణులకు అధిక గిరాకీ ఉంటుండటం, ఉద్యోగార్థులు ఆన్‌లైన్ ఉద్యోగ పోర్టళ్లపై ఎక్కువగా ఆధారపడుతుండటం వల్ల ఈ రంగంలోనే ఉద్యోగ మోసాలు జరిగేందుకు ఎక్కువగా ఆస్కారం ఉంటోందని 43 శాతం మంది ఉద్యోగులు తెలిపారు. ఆ తర్వాతి స్థానాల్లో రిటైల్, ఇ-కామర్స్ (29% మంది), ఫైనాన్స్ (22%), ఆరోగ్య సంరక్షణ (4%) రంగాలు ఉన్నాయని సర్వే తెలిపింది. ఆన్‌లైన్ ఉద్యోగ పోర్టల్‌లు అందుబాటులోకి రావడం వల్ల నియామకాల ప్రక్రియ మరింత సులువైనప్పటికీ.. మోసాలు జరిగేందుకు కూడా ఈ పోర్టళ్లు ఒక మార్గంగా మారాయని నివేదిక తెలిపింది. ఆన్‌లైన్ నియామక పోర్టల్‌లు అధికమవ్వడం వల్ల ఉద్యోగ మోసాలు పెరగడంలో ఇవి ప్రత్యక్ష పాత్ర పోషిస్తున్నాయని 65% మంది తెలిపారు. ఆన్‌లైన్ ఉద్యోగ పోర్టళ్ల రాకతో ఉద్యోగ మోసాల సమస్య తీవ్రమైందని 22% మంది అభిప్రాయపడ్డారు.

## మొబైల్ రీచార్జ్ ధరలు మరోసారి పెరుగుతాయా?

న్యూఢిల్లీ: టెలికం కంపెనీలు మరోసారి చార్జీలు పెంచే అవకాశం ఉందా? ఇన్వెస్టర్లతో ఎర్నింగ్స్ కాల్ సందర్భంగా వొడాఫోన్ ఐడియా సీఈవో అక్షయ మూంద్రా చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఎక్కువ డేటాను వినియోగించే టెలికం చందాదారులు పరిశ్రమకు సహేతుక రాబడిని అందించడానికి, సమాజంలోని అన్ని వర్గాలకు కనెక్టివిటీని చేర్చడానికి మరింత చెల్లించాలని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.కొత్త టెక్నాలజీ వినియోగానికి, డేటా వృద్ధికి తోడ్పడటానికి భారీ పెట్టుబడులు అవసరమని, అదే సమయంలో సమాజంలోని అన్ని వర్గాలకు కనెక్టివిటీని అందించడానికి టారిఫ్‌లు అందుబాటు ధరలో కొనసాగించాలని ఆయన అన్నారు. పెట్టుబడిపై సహేతుక రాబడిని అందుకోవడానికి పరిశ్రమకు వీలు కల్పించేందుకు డేటాను మరింత ఎక్కువగా ఉపయోగించే కస్టమర్లు ఎక్కువ చెల్లించినప్పుడు ఇది సాధ్యమవుతుందని వివరించారు. పరిశ్రమ తన మూలధన వ్యయాన్ని తిరిగి పొందేందుకు టారిఫ్‌ల హేతుబద్ధీకరణ అవసరం అని నొక్కి చెప్పారు. టారిఫ్ పెంపు ఫలితంగా కంపెనీ త్రైమాసిక ప్రాతిపదికన కస్టమర్లను కోల్పోయినప్పటికీ.. మరొకసారి టారిఫ్‌ల పెంపు అవసరమని సూచించారు. టారిఫ్‌ల సవరణ కారణంగా రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా భారీగా చందాదార్లను కోల్పోయాయి. అత్యధికులు బీఎస్ఎన్ఎల్‌కు మారారు. 'సెప్టెంబర్ త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ ప్రభావం ఉంది. ఆగస్ట్ నుండి క్రమంగా నవంబర్ వరకు ఆ ప్రభావం చాలా త్వరగా తగ్గుతోంది' అని మూంద్రా అన్నారు.




## కొత్తగా 27.3 లక్షల టెక్ జాబ్స్.. సాఫ్ట్‌వేర్ కంపెనీ నివేదిక



ముంబై: వర్ధమాన సాంకేతికతల తోడ్పాటుతో కొత్తగా కోట్ల సంఖ్యలో కొలువులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో 2023లో 42.37 కోట్లుగా ఉన్న వర్కర్ల సంఖ్య 2028 నాటికి 45.76 కోట్లకు పెరగనుంది. వెరసి అయిదేళ్ల వ్యవధిలో వర్కర్ల సంఖ్య 3.38 కోట్ల స్థాయిలో వృద్ధి చెందనుంది. వినూత్న టెక్నాలజీల దన్నుతో కీలక రంగాల్లో కొత్తగా 27.3 లక్షల టెక్ కొలువులు రానున్నాయి.అమెరికన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సర్వీస్‌నౌ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఆర్థిక, సాంకేతిక పరివర్తన కారణంగా తయారీ రంగంలో 15 లక్షలు, విద్యారంగంలో 8.4 లక్షలు, ఆరోగ్య సంరక్షణ రంగంలో 80 లక్షల మేర ఉద్యోగాలు పెరగనున్నాయి. అధునాతన నైపుణ్యాలు అవసరమయ్యే హై-వేల్యూ ఉద్యోగాల కల్పనలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషించనుంది.జనరేటివ్ ఏఐ విభాగం పురోగమించే కొద్దీ ఏఐ సిస్టమ్స్ ఇంజినీర్లు, ఇంప్లిమెంటేషన్ కన్సల్టెంట్లు, ప్లాట్‌ఫాం ఓనర్లకు గణనీయంగా ప్రయోజనం చేకూరనుంది. రిటైల్ ప్రొఫెషనల్స్ మెరుగైన అవకాశాలు దక్కించుకునేందుకు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, డేటా ఇంజినీరింగ్ వంటి విభాగాలకు సంబంధించి తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సి ఉంటుంది.

# ఏఐ, రోబోటిక్స్‌కు తయారీ సంస్థల ప్రాధాన్యం

**పర్యావరణహిత విధానాలను అందిపుచ్చుకునేందుకు..**

**ఆదాయాలనూ పెంచుకునేందుకు: పీడబ్ల్యూసీ**

దిల్లీ: వ్యాపారాల్లో పర్యావరణహిత విధానాలను అందిపుచ్చుకునేందుకు, ఆదాయాలను పెంచుకునేందుకు ఎక్కువ సంఖ్యలో భారతీయ సంస్థలు కృత్రిమ మేధ, రోబోటిక్స్ లాంటి కొత్త సాంకేతికతలను వినియోగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయని పీడబ్ల్యూసీ నివేదిక తెలిపింది. వాహన, సిమెంట్, రసాయనాలు, పారిశ్రామిక ఉత్పత్తులు, లోహాలు, జౌళి, వస్త్ర పరిశ్రమ రంగాల్లోని వివిధ కంపెనీలకు చెందిన 180 మంది ఉన్నతాధికార్ల నుంచి అభిప్రాయాలు సేకరించి ఈ నివేదికను రూపొందించింది. ఈ ఏడాది మే- జులై మధ్య ఈ సర్వేను నిర్వహించారు. కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లాంటి ఆధునిక సాంకేతికతలకు, మానవులకు మధ్య సహజీవన సంబంధాన్ని సృష్టించే 'ఇండస్ట్రీ 5.0' దిశగా 93 శాతం తయారీ సంస్థలు అడుగులు వేస్తున్నాయని పీడబ్ల్యూసీ ఇండియా పార్ట్‌నర్, ఇండస్ట్రియల్ ప్రోడక్ట్స్ లీడర్ సుదీప్తా ఘోష్ తెలిపారు. కొత్త సాంకేతికతలను వేగంగా అందిపుచ్చుకునే సంస్థలు రానున్న సంవత్సరాల్లో పోటీపరంగా ముందంజలో ఉంటాయని వెల్లడించారు.

**నివేదికలోని మరిన్ని వివరాలు ఇలా..**

ఈ ఏడాది దాదాపు 50 శాతానికి పైగా భారత తయారీ సంస్థలు పర్యావరణహిత విధానాలపై పెట్టుబడులు పెట్టేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. పునరుత్పాదక విద్యుత్ వనరులు, ఇంధన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు డిజిటల్ సాంకేతికతలను అందిపుచ్చుకోవడంపై ఈ పెట్టుబడులను వినియోగించనున్నాయి. జీవితకాలం శిక్షణా సంస్కృతిని అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రముఖ తయారీ కంపెనీలకు చెందిన 52 శాతం మంది ఉన్నతాధికార్లు వెల్లడించారు. పెట్టుబడుల విషయంలో కొన్ని రంగాలు మిగతా వాటితో పోలిస్తే మరింత దూకుడును ప్రదర్శిస్తున్నాయి. ఉదాహరణకు సిమెంటు, పారిశ్రామిక ఉత్పత్తుల రంగాల్లో 95 శాతం వరకు తయారీ సంస్థలు ఎప్పటికప్పుడు నిల్వల స్థితిని తెలుసుకోవడం (రియల్ టైం ఇన్వెంటరీ ట్రాకింగ్)పై ఈ ఏడాది, వచ్చే ఏడాది పెట్టుబడులు పెట్టేందుకు



ప్రాధాన్యం ఇస్తున్నాయి. వినియోగదార్లు, సిబ్బంది, సరఫరా వ్యవస్థ, వ్యాపార విధానాలు, ఆర్థిక సామాజిక పాలనా (ఈఎస్‌జీ) హామీలకు సంబంధించి 'ఇండస్ట్రీ 5.0' సామర్థ్యాలకు తగ్గట్లుగా సిద్ధమవ్వడం..రాబోయే 1-2 ఏళ్లలో ఆదాయాలు సగటున 6.42 శాతం మేర పెరిగేందుకు దోహదం చేస్తుందని ఎక్కువ శాతం మంది అధికారులు అభిప్రాయపడ్డారు. 'ఇండస్ట్రీ 5.0'ను అందిపుచ్చుకోవడం వల్ల ఆదాయాలు 7 శాతం మేర పెరగొచ్చని రసాయనాలు, సిమెంటు, జౌళి, వస్త్ర రంగాలకు చెందిన ఉన్నతాధికార్లు భావిస్తున్నారు. వినూత్న ఉత్పత్తులు, సేవలకు అదనంగా చెల్లించేందుకు తమ వినియోగదార్లు సుముఖంగానే ఉన్నారని వాహన, లోహ రంగ అధికార్లు తెలిపారు.

# పాకిస్తాన్ రికార్డు బద్దలు..

## భారీ మైలురాయిని అధిగమించిన టీమిండియా



నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సౌతాఫ్రికాపై గ్రాండ్ విక్టరీ (3-1) అనంతరం టీమిండియా ఓ భారీ మైలురాయిని అధిగమించింది. పొట్టి ఫార్మాట్‌లో ఓ క్యాలెండర్ ఇయర్‌లో 90కు పైగా విజయాల శాతం నమోదు చేసిన తొలి జట్టుగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. టీ20 క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టు ఓ క్యాలెండర్ ఇయర్‌లో 90కు పైగా విజయాల శాతాన్ని నమోదు చేయలేదు.భారత్.. పాకిస్తాన్ పేరిట ఉన్న లాంగ్ స్టాండింగ్ రికార్డును బద్దలు కొట్టింది. షార్ట్ ఫార్మాట్‌లో ఈ ఏడాది భారత్ 92.31 విజయాల శాతం కలిగి ఉంది. 2018లో పాక్ 89.43 విజయాల శాతాన్ని నమోదు చేసింది. సౌతాఫ్రికా సిరీస్‌తో కలుపుకుని ఈ ఏడాది భారత్ మొత్తం 26 టీ20లు ఆడింది. ఇందులో 24 విజయాలు నమోదు చేసింది. భారత్ ఈ ఏడాది కేవలం రెండు టీ20ల్లో మాత్రమే ఓడింది. టీమిండియా ఈ ఏడాది టీ20 వరల్డ్ ఛాంపియన్‌గానూ అవతరించింది. యూఎస్ఏ, కరీబియన్ దీవులు వేదికగా జరిగిన పొట్టి ప్రపంచకప్ 2024లో భారత్ జగజ్జేతగా నిలిచింది. టీ20 వరల్డ్‌కప్ అనంతరం భారత్.. జింబాబ్వే, బంగ్లాదేశ్, శ్రీలంక, సౌతాఫ్రికాపై వరుస సిరీస్‌ల్లో విజేతగా నిలిచింది. సౌతాఫ్రికా సిరీస్‌లో కేవలం మూడో టీ20లో మాత్రమే ఓడిన భారత్.. 1, 2, 4 టీ20ల్లో విజేతగా నిలిచింది.

# ఆసీస్ బౌలర్ల విజృంభణ..

## 117 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్



హెూబర్ట్ వేదికగా పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడో టీ20లో ఆస్ట్రేలియా బౌలర్లు చెలరేగిపోయారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్.. ఆసీస్ బౌలర్లు ఆరోన్ హార్డీ (4-1-21-3), ఆడమ్ జంపా (4-0-11-2), స్పెన్సర్ జాన్సన్ (3.1-0-24-2), జేవియర్ బార్ట్‌లెట్ (3-0-25-1), నాథన్ ఇల్లిస్ (3-0-20-1) ధాటికి 18.1 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో బాబర్ ఆజమ్ (41) ఒక్కడే ఓ మోస్తరు స్కోర్‌తో రాణించాడు. హసీబుల్లా ఖాన్ (24), షాహీన్ అఫ్రిది (16), ఇర్ఫాన్ ఖాన్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. సాహిబాజాదా ఫర్హాన్ 9, ఉస్మాన్ ఖాన్ 3, అఘా సల్మాన్ 1, అబ్బాస్ అఫ్రిది 1, జహందాద్ ఖాన్ 5, సూఫియాన్ ముఖీమ్ 1 పరుగు చేశారు.కాగా, మూడు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. ప్రస్తుతం జరుగుతున్న మూడో టీ20 నామమాత్రంగా సాగుతుంది. వర్షం కారణంగా 7 ఓవర్లకు కుదించిన తొలి గేమ్‌లో 29 పరుగుల తేడాతో గెలుపొందిన ఆసీస్.. రెండో టీ20లో 13 పరుగుల తేడాతో నెగ్గింది. టీ20 సిరీస్‌కు ముందు పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరిగింది. ఈ సిరీస్‌ను పాక్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల వన్డే, టీ20 సిరీస్‌ల కోసం పాకిస్తాన్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది.

# అశ్విన్‌తో ఢీకి రెడీ!

## పట్టు బిగించకుండా చూస్తాను


### ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ వ్యాఖ్య



మెల్‌బోర్న్: భారత వెటరన్ స్పిన్నర్ అశ్విన్ బౌలింగ్‌లో జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని, ఈసారి అతడు మ్యాచ్‌పై పట్టు బిగించకుండా చేస్తానని ఆస్ట్రేలియన్ స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ అన్నాడు. కంగారూ గడ్డపై అశ్విన్‌కు మంచి రికార్డు లేదు. స్వదేశంలో 21.57 సగటు నమోదు చేస్తే ఆసీస్‌లో అది 42.15 మాత్రమే. అయితే గత రెండు బోర్డర్%-%గావస్కర్ సిరీస్‌లలో ఫామ్‌లో ఉన్న స్మిత్‌ను అదే పనిగా అవుట్ చేసి పైచేయి సాధించాడు. ఈ రెండు సిరీస్‌లలో అశ్విన్ అతన్ని క్రీజులో పాతుకుపోనీయకుండా ఐదుసార్లు పెవిలియన్ చేర్చాడు. దీనిపై ఆసీస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్మిత్ మాట్లాడుతూ 'ఈసారి అలా జరగకుండా చూసుకోవాలి. అయితే అశ్విన్ మాత్రం ఉత్తమ స్పిన్నర్. తప్పకుండా తన ప్రణాళికలు తనకు ఉంటాయి. గతంలో అతని ఎత్తుగడలకు బలయ్యాను. నాపై అతనే ఆధిపత్యం కనబరిచాడు. ఇప్పుడలా జరగకుండా చూసుకోవాలంటే ఆరంభంలోనే అతను పట్టు బిగించకుండా దీటుగా ఎదుర్కోవాలి' అని అన్నాడు. గత కొన్నేళ్లుగా తమ ఇద్దరి మధ్య ఆసక్తికర సమరమే జరుగుతోందన్నాడు. ఒకరు పైచేయి సాధిస్తే, మరొకరు డీలా పడటం జరుగుతుందని... ఐదు టెస్టుల్లో పది ఇన్నింగ్స్‌ల్లో ఇప్పుడు ఎవరూ ఆధిపత్యం కనబరుస్తారో చూడాలని స్మిత్ తెలిపాడు.

**ప్రపంచంలో ఏ పిచ్‌పై అయినా పరుగుల వరద పారించగల సామర్థ్యం ఉన్న బ్యాటర్లు.. బంతిని అందుకుంటే పిచ్‌తో సంబంధం లేకుండా రాకెట్ వేగానికి తోడు బాల్‌ను రెండు వైపులా స్వింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టే బౌలర్లు.. మ్యాచ్‌ను మలుపు తిప్పగల ఆల్‌రౌండర్లు.. సొంతగడ్డపై అనుకూల పరిస్థితులు.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో గత రెండుసార్లు ఎదురైన సిరీస్ ఓటములకు బదులు తీర్చుకోవాలన్న పట్టుదల.. వెరసి భారత్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా పూర్తిస్థాయి అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతోంది.**

# వీళ్లను ఆపకుంటే కష్టమే!





స్టీవ్ స్మిత్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్, అలెక్స్ క్యారీ, మిచెల్ స్టార్క్, జోష్ హెజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నాథన్ లియాన్.. క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేర్లివి. మరో మూడు రోజుల్లో మొదలుకాబోయే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్.. ఆస్ట్రేలియా గడ్డపై ముచ్చటగా మూడోసారి సొంతం చేసుకోవాలన్నా.. ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో మూడోసారి ఆడాలన్నా పైన పేర్కొన్న ఆటగాళ్ల దూకుడుకు అడ్డుకట్టవేయడం అత్యంత ఆవశ్యకం. బ్యాటర్లతో పాటు బౌలర్లలో ఏ ఒక్కరు కుదురుకున్నా మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకోవాల్సిందే. గత రెండు సిరీస్‌లలో వీరి జోరుకు కళ్లెం వేసినా ప్రస్తుతం ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఈ గెలుపు గుర్రాలను ఆపడం అంత సులభమేమీ కాదు.

**వీరికి కళ్లెం వేయాలి**

భారత్‌తో మ్యాచ్ అంటేనే చెలరేగి ఆడే బ్యాటర్లలో స్మిత్, హెడ్, లబూషేన్ అత్యంత కీలకం. వీళ్లు క్రీజులో కుదురుకుంటే ఓ పట్టాన పెవిలియన్‌కు చేరరు. సీనియర్ బ్యాటర్ స్మిత్ టీమ్‌ఇండియా అంటేనే చెలరేగిపోతాడు. మనతో ఆడిన 19 టెస్టులలో అతడు ఏకంగా 65.87 సగటుతో 2,042 పరుగులు చేశాడు. ఇందులో 9 శతకాలు, 5 అర్ధ శతకాలున్నాయి. స్వదేశంలో భారత్‌పై 16 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 83.23 సగటుతో 1,082 పరుగులు చేశాడంటేనే అతడి జోరును అర్థం చేసుకోవచ్చు. ఓపెనర్ ఖవాజాకు భారత్‌పై ఘనమైన రికార్డేమీ లేకపోయినా ఈ డబ్ల్యూటీసీ సైకిల్‌లో అతడు జోరుమీదున్నాడు. గత 12 టెస్టులలో అతడు 943 పరుగులు (41 సగటు) సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. డేవిడ్ వార్నర్ రిటైర్ అయిన తర్వాత అతడు సరైన ఓపెనింగ్ భాగస్వామి లేక ఇబ్బందిపడుతున్నా గతేడాది భారత పర్యటనలో బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న అనుభవం అతడికుంది.టెస్ట్ స్పెషలిస్టు లబూషేన్ గత పర్యటనలో టాప్ స్కోరర్ (426 పరుగులు). భారత్‌పై ఆడిన 10 మ్యాచ్‌లలో అతడు 45.58 సగటుతో 775 రన్స్ చేశాడు. అతడూ ప్రమాదకారే. ఇక రోహిత్ సేనకు రెండు ఐసీసీ ట్రోఫీలను దూరం చేయడంలో కీలకపాత్ర పోషించిన ట్రావిస్ హెడ్ మిడిలార్డర్‌లో అత్యంత కీలకం. వన్డే వరల్డ్‌కప్, డబ్ల్యూటీసీ ఫైనల్-2023లో అతడు భారత బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారాడు. వికెట్ కీపర్ బ్యాటర్ క్యారీ సైతం అదే కోవకు చెందుతాడు. గత 20 ఇన్నింగ్స్‌లలో అతడు 536 పరుగులు చేసి ఆసీస్ విజయాల్లో కీలకంగా మారుతున్నాడు.

తుది జట్టులో చోటు దక్కించుకుంటే మిచెల్ మార్ష్ మ్యాచ్ గమనాన్నే మార్చేయగల సమర్థుడు. రికార్డులపరంగా వీళ్లంతా దుర్భేధ్యంగా కనిపిస్తున్నప్పటికీ గత కొంతకాలంగా వీరిలో ఖవాజా, మార్ష్ మాత్రమే టెస్టులలో 40 సగటు కలిగిఉన్నారు. 2023-25 సైకిల్‌లో 12 మ్యాచ్‌లు ఆడిన స్మిత్.. 35 సగటుతో 738 పరుగులు చేయగా.. లబూషేన్ 12 టెస్టులలో 29.68 సగటుతో 653 రన్స్ మాత్రమే సాధించాడు. గత డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత ఆడిన 12 టెస్టులలో హెడ్ సగటు 29.68 మాత్రమే.



# కోహ్లిపై ఒత్తిడి పెంచండి!

## ఆసీస్ బౌలర్లకు మెక్‌గ్రాత్ సూచన



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై విరాట్ కోహ్లి ఆధిపత్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అక్కడ ఆడిన 13 టెస్టుల్లో ఏకంగా 54.08 సగటుతో 1352 పరుగులు చేసిన కోహ్లి ఖాతాలో 6 సెంచరీలు ఉన్నాయి. కెప్టెన్‌గా 2018%-%19లో తొలిసారి భారత జట్టుకు ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ అందించిన ఘనత అతని సొంతం. అందుకే ఇటీవల కోహ్లి గొప్ప ఫామ్‌లో లేకపోయినా...ఆసీస్ దృష్టిలో అతనే ప్రధాన బ్యాటర్. కోహ్లిని నిలువరిస్తే భారత్‌ను అడ్డుకున్నట్లే అని అక్కడి మాజీ ఆటగాళ్లకూ తెలుసు. అందుకే కోహ్లిపై ఒత్తిడి పెంచాలని, అతడి భావోద్వేగాలతో ఆడుకోవాలని దిగ్గజ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ తమ బౌలర్లకు చెబుతున్నాడు. ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో చిత్తయిన విషయం వారి మనసుల్లో ఇంకా ఉంటుందని...దానిని కొనసాగించాలని అతను అన్నాడు. 'ఒక జట్టు సొంతగడ్డపై 0%-%3తో ఓడి వస్తుందంటే కచ్చితంగా మనమే పైచేయి సాధించేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి భారత్‌పై ఒత్తిడి కొనసాగించాలి. వారు సిద్ధంగా ఉన్నారో లేదో తెలుస్తుంది. ముఖ్యంగా విరాట్ కోహ్లిపై కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి' అని మెక్‌గ్రాత్ చెప్పాడు. అయితే కొన్ని సార్లు ఇలా రెచ్చగొడితే కోహ్లి మరింత దూకుడుగా చెలరేగిపోయే ప్రమాదం కూడా ఉంటుందని ఆసీస్ మాజీ పేసర్ చిన్న హెచ్చరిక కూడా జారీ చేశాడు. 'కోహ్లిని లక్ష్యంగా చేసుకొని ఆస్ట్రేలియా బౌలర్లు పదేపదే తలపడితే అతనూ సిద్ధమైపోతాడు. అది అతడి అత్యుత్తమ ఆటను కూడా బయటకు తీయవచ్చు. సిరీస్ ఆరంభంలోనే తక్కువ స్కోర్లకు కట్టడి చేయగలిగితే కోహ్లి కూడా కోలుకోవడం కష్టమవుతుంది. నా దృష్టిలో కోహ్లితో భావోద్వేగాలపాలు ఎక్కువ. బాగా ఆడటం మొదలు పెడితే అస్సలు ఆగిపోడు. ఒక వేళ విఫలమైతే మాత్రం అదే కొనసాగుతుంది' అని మెక్‌గ్రాత్ అభిప్రాయ పడ్డాడు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## మహారాష్ట్రలో ప్రియాంకాగాంధీ రోడ్‌షో



**ముంబై, (క్రైమ్ మిర్రర్):** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఆర్ఎస్ఎస్ కంచుకోట అయిన నాగపూర్‌లో ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక భవనంపై ఉన్న బీజేపీ మద్దతుదారులు ఆ పార్టీ జెండాలను ఊపి నినాదాలు చేశారు. ఇది చూసి కాంగ్రెస్ మద్దతుదారులు కూడా తమ పార్టీ నినాదాలు చేశారు. కాగా, ప్రియాంక గాంధీ చిరునవ్వుతో దీనిపై స్పందించారు. బుధవారం జరుగనున్న పోలింగ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. మైక్ తీసుకొని వారినుద్దేశించి ఆమె మాట్లాడారు. 'బీజేపీ మిత్రులారా, మీకు ఎన్నికల శుభాకాంక్షలు. కానీ మహా వికాస్ అఘాడీ గెలుస్తుంది' అని అన్నారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు ప్రియాంక గాంధీ రోడ్‌షో తర్వాత నాగ్‌పూర్ సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థి బంటీ షెల్కే, ఆ బీజేపీ మద్దతుదారుల మధ్య వాగ్వాదం జరిగింది. అయితే ఈ విషయం బయటకు రానివ్వలేదని సమాచారం. కాగా, బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం నాగపూర్‌లో ఉంది. దీంతో ఈ నగరాన్ని బీజేపీ కంచు కోటగా పరిగణిస్తారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2014 నుంచి వరుసగా నాగపూర్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. అలాగే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు స్థానాలు ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉన్నాయి.

## మహిళలపై అత్యాచారాలపై వాడీవేడి చర్చ

### గతం కన్నా శాంతిభద్రతలు పెరిగాయి

### వైసిసి సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టిన హోంమంత్రి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో జగన్ ప్రభుత్వం కంటే ఈ ఐదు నెలల్ కూటమి ప్రభుత్వంలో క్రైమ్ రేటు చాలా తగ్గిందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఇది గుర్తించాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో శాసన మండలిలో మహిళల అత్యాచారాలపై వాడివేడి చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం మొదలైంది. ఈ విషయంపై హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. గతం కంటే ఎంతో మేలన్నారు. శాంతిభద్రతలపై దృష్టి పెట్టామని అన్నారు. అయతే మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. దిశ చట్టం తీసుకొస్తారా, దిశ యాప్ కొనసాగిస్తారా లేదా అని వైసీపీ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ప్రశ్నించారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి అనిత సమాధానం ఇస్తూ వైసీపీ ప్రభుత్వ పాలనలో చాలా లోపాలు ఉన్నాయని మంత్రి అనిత తెలిపారు. దిశ చట్టం లేదు. నిర్భయ చట్టం ఉంది. నిర్భయ కింద వైసీపీ ప్రభుత్వంలో కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిన అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఎందుకు నిర్మించలేదని వైసీపీ సభ్యులు నిలదీశారు. గంజాయి వినియోగం పెరగడంతో రాష్ట్రంలో నేరాలు పెరిగాయని మంత్రి అనిత వివరించారు. అయితే హోం మంత్రి అనిత వ్యాఖ్యలను వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిల్ అయిందంటూ వైసీపీ నినాదాలు చేసింది. లా అండ్ ఆర్డర్ ఫెయిల్ కారణంతోనే నీలాంటి వారు సభకు వస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను ఉద్దేశించి మంత్రి అనిత అన్నారు. తన సమాధానం వినటానికి దమ్ము, ధైర్యం కావాలని మంత్రి అనిత అన్నారు. మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. తర్వాత ప్రశ్నకు వైసీపీ సభ్యులు సభలోకి వచ్చారు.

## శాంతిభద్రతలపై నిలదీసిన వైసీపీ సభ్యులు

### సమావేశం నుంచి వాకౌట్

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపిస్తూ వైసీపీ ఎమ్మెల్సీలు మండలి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సోమవారం మండలి సమావేశం ఛైర్మన్ మోషెన్‌రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతలపై వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ ఎమ్మెల్సీ వరదు కల్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేరాలు, ఘోరాలు పెరిగిపోయాయని, ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, హత్యల సంఖ్య పెరిగిందని ఆరోపించారు. వీటిని అరికట్టడంతో ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆరోపించారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ శాంతి భద్రతలు ఘోరంగా విఫలం అయ్యిందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పిన వ్యాఖ్యలను గుర్తు చేయగా హెూంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అసహనం వ్యక్తం చేశారు. అత్యాచార ఘటనను రాజకీయం చేయొద్దని కోరారు. దమ్ము, ధైర్యముంటే వైసీపీ పాలనలో తీసుకొచ్చిన దిశ చట్టం వల్ల ఎలాంటి మేలు జరుగలేదని, పైగా నేరాలు పెరిగిపోయాయని విమర్శించారు. దమ్ము, ధైర్యం అనే పదాలు వాడినందుకు క్షమాపణ చెప్పాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టగా చివరికి అనిత క్షమాపణలు చెప్పారు. దిశ యాప్‌ను , దిశ పోలీస్‌స్టేషన్లను కొనసాగిస్తారా లేదా అంటూ వైసీపీ ఎమ్మెల్సీ కల్యాణి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హెూంమంత్రి అనిత స్పందిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దిశ చట్టాన్ని, పోలీస్‌స్టేషన్లను ఎత్తివేశామని వెల్లడించారు. గతంలో కంటే నేడు రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గాయని పేర్కొన్నారు.

## పోసాని కృష్ణ మురళిపై సీఐడీ కేసు నమోదు



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** టాలీవుడ్ సీనియర్ నటుడు, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, మాజీ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోసాని కృష్ణ మురళిపై సీఐడీ కేసు నమోదు అయ్యింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో పోసానిపై ఈ నెల 9న కేసు నమోదు అయినట్లు సమాచారం. బీఎన్ఎస్ 2003 యాక్ట్ ప్రకారం.. 111, 196, 353, 299, 341, 336 (3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు పోలీసులు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల, (క్రైమ్ మిర్రర్):** కార్తిక మాసం సందర్భంగా తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఏడుకొండల వాడిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మూడు కంపార్టుమెంట్లు నిండిపోగా టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 71,441 మంది భక్తులు దర్శించుకోగా 23,595 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.87 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ సజ్జలను కో ఆర్డినేటర్‌గా నియమించారు. రాష్ట్ర కార్యదర్శులుగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, అనకాపల్లికి చెందిన బొడ్డేడ ప్రసాద్‌ను నియమించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు , ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా చుండూరు రవిబాబు, ఆముదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్‌ను నియమించారు.

## 110 మంది ఉద్యోగుల్లో 99 మందిపై వేటు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** అమెరికాకు చెందిన ఓ మ్యూజిక్ కంపెనీ సీఈవో కీలక నిర్ణయం తీసుకున్నారు. మీటింగ్‌కు హాజరు కాలేదన్న కారణంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించారు. మొత్తం 110 మంది ఉద్యోగుల్లో 99 మందిపై వేటు వేశారు. సంస్థలో పనిచేస్తున్న ఓ ఇంటర్న్ ఉద్యోగి పెట్టిన రెడ్డిట్ పోస్ట్‌తో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇటీవలే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సీఈవో మార్నింగ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని ఆదేశించారు. అయితే, మొత్తం 110 మందిలో ఈ మీటింగ్‌కు కేవలం 11 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 99 మంది సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సదరు సీఈవో.. ఉద్యోగులపై వేటు వేశారు. సమావేశానికి హాజరుకాని 99 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనులు పూర్తిచేయడంలో, సమావేశాలకు హాజరుకావడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు. ఈ కారణంచేత ఉద్యోగులతో ఉన్న ఒప్పందాలను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కంపెనీకి సంబంధించిన వస్తువులు ఏమైనా ఉంటే వాటిని వెంటనే తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన ఉద్యోగులు మాత్రమే సంస్థలో ఉంటారని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీఈవో వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో స్పందిస్తున్నారు.

## బిజేపీ నేత నవనీత్ కౌర్‌పై అల్లరి మూకల దాడి



**ఖల్లార్, (క్రైమ్ మిర్రర్):** బిజేపీ నాయకురాలు, మహారాష్ట్ర అమరావతి మాజీ ఎంపీ నవనీత్ కౌర్ రాణా.. ఎన్నికల ర్యాలీ కార్యక్రమంలో అల్లరి మూకలు దాడి చేశాయి. శనివారం సాయంత్రం అమరావతిలో జరిగిన ఈ ఘటనలో కొందరు యువకులు కుర్చీలు విసిరారు. ఆమె అనుచరులపై దాడి చేశారు. దీంతో మాజీ ఎంపీ నవనీత్ రాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బిజేపీ నాయకురాలు నవనీత్ రాణా అమరావతిలోని ఖల్లార్ గ్రామంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. అక్కడ దర్యాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజేపీ అభ్యర్థి రమేష్ బుందిలే కు మద్దతుగా ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. ఫిర్యాదు చేసిన తరువాత మాజీ ఎంపీ నవనీత్ రాణా మీడియాతో మాట్లాడారు. "పోలీసులు త్వరగా చర్యలు చేపట్టాలి.. దోషులను 48 గంటల్లోగా అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నా.. లేకపోతే మా కార్యకర్తలు కూడా దాడి చేసిన వారిపై తగిన రీతిలో సమాధానం చెబుతారు. ఎవరినీ అరెస్టు చేయకపోతే అమరావతిలోని మొత్తం హిందూ సమాజం ఇక్కడ ఏకమవుతుంది." అని హెచ్చరించారు.దాడి ఘటన గురించి నవనీత్ రాణా మీడియాకు వివరించారు. "మేము శాంతియుతంగా ఖల్లార్ గ్రామంలో ప్రచారం చేసుకుంటున్నాం. ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఒక వేదిక ఏర్పాటు చేశారు. నేను వేదికపైకి వెళుతుండగా.. కొందరు మతపరమైన నినాదాలు చేశారు. నా గురించి అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. బిజేపీ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. కార్యక్రమంలో ఇలాంటి నినాదాలు ఇవ్వకూడదని వారించారు. కానీ ఆ అల్లరి మూకలు ఇంకా రెచ్చిపోయారు.

## అసెంబ్లీలో ఒక గంట సమయం ఇస్తేనే జగన్ వస్తారు

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ ఉందని, రోజుకు ఒక గంట జగన్‌కు మాట్లాడేందుకు సమయం ఇస్తే ఆయనే సభకు వస్తారని, లేని పక్షంలో అతను రారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం అసెంబ్లీ వద్ద మీడియాతో ఆయన చిట్ చాట్‌గా మాట్లాడారు. 2017లో ఆయన పాదయాత్రకు వెళ్ళే సమయంలో బాధ్యతలు బుగ్గనకు గానీ ఇంకెవరికైనా అప్పగించి వెళ్ళాలి.. కానీ జగన్ అలా చేయలేదు... ఎందుకంటే ఆయన మినహా మిగతావారెవరూ మాట్లాడటం అతనికి ఇష్టం ఉండదని అన్నారు. అందుకనే జగన్ అసెంబ్లీకు రావడంలేదని... ఎవరిని రానివ్వడం లేదని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మైక్ ఆయన ఒక్కడికే ఉండాలి... ఇంకెవరు మాట్లాడకూడదని ఆయన అనుకుంటారన్నారు. అందుకనే జగన్‌కు స్పీకర్ గంట సమయం మాట్లాడటానికి ఇస్తానంటే మంగళవారం అసెంబ్లీకు వస్తారన్నారు. జగన్‌ను చూసి చాలా రోజులు అవుతుంది.. కానీ ఆయన మాత్రం అసెంబ్లీకి రావడం లేదని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. దీనికి పరిష్కారం ఏంటంటే.. రోజుకు జగన్‌కు గంట మాట్లాడేందుకు సమయం ఇస్తే వస్తారన్నారు. ఇంకొ విషయం ఏంటంటే.. ఆయన ఏం మాట్లాడినా అడ్డం రాకూడదని.. ఇది జగన్ ఫిలాసఫీ అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ ఎప్పుడు సమస్యల కోసం పోరాడలేదని.. ఆయన మైక్ కోసమే మమ్ములను పోరాడమని చెప్పేవారని ఎమ్మెల్యే కోటంరెడ్డి వ్యాఖ్యానించారు.

## కర్నాటకలో బిజెపి రాజకీయ బేరాల కలకలం

- మాండ్య ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ఆరోపణలు
- తగిన ఆధారాలు ఉన్నాయని వెల్లడి
- ఆరోపణలను తిప్పికొట్టిన కేంద్రమంత్రి



**బెంగళూరు, (క్రైమ్ మిర్రర్):** కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భాజపా ప్రయత్నిస్తోందంటూ మాండ్య ఎమ్మెల్యే రవికుమార్ గౌడ చేసిన ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఒక్కో ఎమ్మెల్యేకు భాజపా రూ.100 కోట్లు చొప్పున ఆఫర్ చేస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలను భాజపా మానుకోవాలని హెచ్చరించారు. 'ఆపరేషన్ కమల'లో మా ఎమ్మెల్యేలు పడరని భాజపా ప్రయత్నాలను నిరూపించే డాక్యుమెంట్లు, ఆధారాలు మా వద్ద ఉన్నాయి. తగిన సమయంలో త్వరలోనే మీడియా ఎదుట వాటిని విడుదల చేస్తాం అని ఎమ్మెల్యే రవికుమార్ విలేకర్ల వద్ద అన్నారు. కిట్టూర్ ఎమ్మెల్యే బాబాసాహెబ్ డి. పాటిల్, చిక్కమగళూరు ఎమ్మెల్యే హెచ్‌డీ తమ్మయ్యలను భాజపా సంప్రదించిందని, భాజపా ప్రలోభపెట్టే ప్రయత్నాలను నిరూపించే 'డాక్యుమెంట్లు, ఆధారాలు ' తన వద్ద ఉన్నాయన్నారు. అయితే, భాజపా గానీ, ఇంకెవరు గానీ తమను సంప్రదించలేదని, డబ్బు ఆఫర్ చేయలేదని పాటిల్, తమ్మయ్య ఇద్దరూ స్పష్టం చేయడం గమనార్హం. మరోవైపు, ఇదే అంశంపై భాజపా దీటుగా స్పందించింది. దమ్ముంటే ఆధారాలు బయటపెట్టి విచారణ జరిపించాలని సవాల్ విసిరింది.భాజపాపై ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఆ పార్టీ నేతలు జైలుకు వెళ్లాల్సి వస్తుందని.. అందుకే ఎలాగైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారని, దీనికి జేడీఎస్ సైతం తోడైందని ఆరోపించారు. దాదాపు 50 మంది ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి ప్రభుత్వాన్ని పడగొట్టాలని భాజపా యోచిస్తోందని, వారంతా గట్టి కాంగ్రెస్ వాదులు గనక పార్టీ మారరన్నారు. 30మందికి మంత్రి పదవులు ఇస్తామని చెప్పారన్నారు. ఎన్నిరకాలుగా ప్రలోభ పెట్టినా తగ్గకపోవడంతో తొలుత రూ. 50 కోట్లు ఇస్తామని.. ఇప్పుడేమో రూ.100 కోట్లకు పెంచారన్నారు. ఎలాగైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకొంటున్నారని రవి ఆరోపించారు. ఏ ఎయిర్ పోర్టులో, హోటల్‌లో, గెస్ట్ హౌస్‌లో ఎవరు ఎవరితో మాట్లాడారో.. దానికి సంబంధించిన పత్రాలను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. సీఎంను కలిసి చర్యలు తీసుకోవాలని కోరతానన్నారు. ఈ వ్యవహారంపై కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర స్పందించారు. ఇప్పుడు రూ.కోట్లకు విలువలేదని, అందువల్ల ఎంత మొత్తానికైనా కోట్ చేయొచ్చని ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. అయితే, అలాంటి ప్రయత్నాలు మాత్రం జరుగుతున్నాయనేది నిజమన్నారు. ఇందులో భాజపా ప్రసిద్ధిగాంచిందని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కమల చేపట్టడంలో నిపుణత కలిగిన ఆ పార్టీ మహారాష్ట్ర, గోవా, మధ్యప్రదేశ్‌లో ఇలాగే చేసిందని ఆరోపించారు. ఇప్పుడు అలాంటి చర్య కర్ణాటకలో చేస్తున్నారన్నారు. కచ్చితమైన మొత్తాన్ని చెప్పలేకపోయినప్పటికీ.. రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నట్లు అంచనా ఉందని.. ఇలా జరుగుతున్నట్లు సీఎం స్వయంగా చెప్పారన్నారు. అయితే, ఈ ఆరోపణలపై దర్యాప్తునకు ప్రభుత్వం సిట్‌తో దర్యాప్తు జరిపిస్తుందా? అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి స్పందిస్తూ.. 'అవసరమైతే చేస్తాం....అలాంటి పరిస్థితి వస్తే అదే చేస్తాం అన్నారు. కాంగ్రెస్ నేతల ఆరోపణలపై భాజపా సీనియర్ నేత, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ దీటుగా స్పందించారు. తమ వద్ద ఉన్నాయని చెబుతోన్న ఆడియో, వీడియో ఆధారాలను వెంటనే బయటపెట్టి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. సీఎం సిద్ధరామయ్య ముడా కేసులో పట్టుబడటం వంటి అంశాలనుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రూ.కోట్ల డబ్బు ఎవరు ఇచ్చారో డాక్యుమెంట్లు విడుదల చేస్తే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

# క్రైమ్‌ని కళ్లకు కట్టాడు



"మనం ఫైనాన్షియల్ క్రైమ్ గురించి వింటూ ఉంటాం. ఎలా జరుగుతాయో తెలీదు. ఈ సినిమాలో వాటిని దర్శకుడు కళ్లకు కట్టాడు. ఈ కథలో రెండు ప్రపంచాలుంటాయి. ఒకటి బ్యాంక్ ప్రపంచం, రెండోది గ్యాంగ్‌స్టర్ ప్రపంచం. ఇందులో గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తా." అని హీరో డాలీ ధనంజయ్ తెలిపారు. సత్యదేవ్‌తో కలిసి ఆయన నటించిన యాక్షన్ ఎంటైర్టైనర్ 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. నవంబర్ 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా డాలీ ధనంజయ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'వాణిజ్యవిలువల కలబోత ఈ చిత్రం. సత్యదేవ్‌తో నటించడం ఓ గొప్ప అనుభూతి. ఇందులో ప్రతి పాత్ర కీలకమే.' అని చెప్పారు. రవి బస్రూర్ సినిమాకు కొత్త సౌండ్ ఇచ్చారనీ, నిర్మాతలు పాషన్‌తో తీసిన ఈ సినిమా తప్పక సక్సెస్ అవుతుందని డాలీ ధనంజయ్ నమ్మకంగా చెప్పారు.


# పెళ్లి వార్త నిజమేనా?



కీర్తి సురేశ్ పెళ్లి ఖాయమైందట. తన చిరకాల మిత్రుడితో పెళ్లికి కీర్తి ఓకే చెప్పిందని, గోవా బీచ్ లొకేషన్‌లో పెళ్లి వేదికను ఫిక్స్ చేశారనీ, బంధుమిత్రుల సమక్షంలో ఈ జంట ఒకటవ్వబోతున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పుడు అవే కథనాలు సౌత్ మీడియాలోనూ వ్యాపించాయి. నిజానికి ఈ తరహా వార్తలు కీర్తి సురేశ్‌కి కొత్తేం కాదు. గతంలో సంగీత దర్శకుడు అనిరుథ్‌తో తను ప్రేమలో ఉందని, త్వరలో పెళ్లాడబోతున్నదని కొన్ని కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దుబాయికి చెందిన ఓ వ్యాపారితో పెళ్లి ఖాయమైందని కూడా ప్రచారం జరిగింది. అయితే.. వాటన్నింటినీ కీర్తి సురేశ్ సున్నితంగా ఖండించింది. ఇప్పుడు వినిపిస్తున్న వార్తలపై మాత్రం కీర్తి కానీ, ఆమె కుటుంబసభ్యులు కానీ స్పందించకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. త్వరలోనే ఈ పెళ్లిని అధికారికంగా ప్రకటిస్తారని కూడా ప్రచారం జరుగుతున్నది. మరి కీర్తి సురేశ్ కుటుంబం నుంచి ఎలాంటి సమాచారం వస్తుందో చూడాలి.

# మహారాష్ట్రలో ఆటాపాటా

యువహీరో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటైర్టైనర్ 'తెలుసుకదా'. ట్కస్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా మారారు. పీపుల్‌మీడియా పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. మహారాష్ట్రలో సిద్ధు జొన్నలగడ్డ, కథానాయిక శ్రీనిధి శెట్టిపై చిత్రీకరిస్తున్న సాంగ్‌తో తాజా షెడ్యూల్ మొదలైంది. 24 రోజులపాటు జరిగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో క్రూషియల్ టాకీపార్ట్‌ని కూడా షూట్ చేయనున్నామని మేకర్స్ తెలిపారు. లీడ్ యాక్టర్స్‌తో పాటు సినిమాలోని కీలక నటీనటులంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని వారు తెలిపారు. రాశీ ఖన్నా మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్రధారి. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: థమన్.





# అక్టోబర్ 2న కాంతారా చాప్టర్ 1

రెండేళ్ల క్రితం కన్నడలో రూపొంది, తెలుగులో అనువాదమైన 'కాంతార' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో కేవలం 16కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం దాదాపుగా 450కోట్ల వసూళ్లు రాబట్టి, కన్నడ సినిమా ఖ్యాతిని పెంచింది. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార చాప్టర్ 1' రూపొందుతున్న విషయం తెలిసిందే. కదంబుల కాలంలో సాగే కథాంశంతో ఈ సినిమా ఉండనుందని తెలుస్తున్నది. రిషబ్‌శెట్టి దర్శకత్వంలో హొంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కింగరదూర్ నిర్మిస్తున్న ఈ భారీ పీరియాడిక్ డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. దేశవాప్తంగా భారీ అంచనాలున్న ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా అని సినీ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. వచ్చే ఏడాది అక్టోబర్ 2న 'కాంతార చాప్టర్ 1'ని విడుదల చేయనున్నట్టు ఆదివారం మేకర్స్ ప్రకటించారు. జయరామ్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ కూడా నటిస్తారని గతంలో వార్తలొచ్చాయి. రిషబ్ ప్లాన్ చేస్తే 'కాంతార'లో భాగం అవ్వడానికి తనకేం అభ్యంతరం లేదని తారక్ కూడా అన్నారు. మరేమవుతుందో చూడాలి.

# ట్రోలర్స్ నన్ను ఏమీ చేయలేరు



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి, రజనీ తాళ్లూరి నిర్మించారు. మీనాక్షి చౌదరి, శ్రద్ధాశ్రీనాథ్ కథానాయికలు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం వరంగల్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'నేను సినిమా ఫంక్షన్స్‌లో మాట్లాడిన వీడియోలను కట్ చేసి..వాటిని సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ కొందరు వ్యక్తులు ట్రోలింగ్‌కు పాల్పడుతున్నారు. సోషల్‌మీడియా వేదికల్లో నన్ను ట్రోల్ చేసేవారి గురించి అస్సలు పట్టించుకోను. ట్రోలర్స్ నన్ను ఏమీ చేయలేరు. నా సినిమాల గురించి ఎవరు ఎలా విశ్లేషించినా ఫర్వాలేదు. అది వాళ్లకున్న స్వేచ్ఛ అనుకుంటా. కానీ నన్ను పర్సనల్‌గా అటాక్ చేస్తే మాత్రం ఊరుకోను. హిట్టయినా, ఫ్లాపయినా సినిమాలు చేస్తూనే ఉంటా. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో 'మెకానిక్ రాకీ' విభిన్నంగా నిలుస్తుంది. 21వ తేదీన పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం' అన్నారు.



# ఎక్కడా తగ్గని పుష్పరాజ్ మీ ప్రేమకు తలొంచాడు

"బీహార్ ప్రజలకు నా ప్రణామాలు. ఎక్కడా తగ్గని పుష్పరాజ్ మీ ప్రేమకు తలొంచాడు. థ్యాంక్యూ పాట్నా. దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'పుష్ప 2'. ఆ స్థాయిలో ప్రేక్షకులు ఈ సినిమాను సొంతం చేసుకున్నారు. డిసెంబర్ 5న సినిమా విడుదల కానుంది. మీ అంచనాలను మించి సినిమా ఉంటుంది" అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'పుష్ప 2'. రెండేళ్ల క్రితం విడుదలై, దేశవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకున్న "పుష్ప' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. బీహార్ రాజధాని పట్నాలో ఆదివారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలో భాగంగా 'పుష్ప 2' ట్రైలర్‌ని కూడా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడారు. 'మీప్రేమను జీవితంలో మరిచిపోలేను. మీ అందరి అంచనాలను మించేలా సినిమా ఉంటుంది. డిసెంబర్ 5 కోసం మీలాగే నేనూ ఆతృతగా ఎదురుచూస్తున్నా. ఐలవ్యూ పాట్నా..' అని కథానాయిక రష్మిక మందన్నా అన్నారు. ఇంకా నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక 'పుష్ప2' ట్రైలర్ విషయానికొస్తే.. 'ఎవడ్రా వీడు.. డబ్బంటే లెక్కలేదు.. పవర్ అంటే భయంలేదు..' అనే జగపతిబాబు డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ మోడ్‌లో సాగింది. డాన్‌గా మారిన పుష్పరాజ్‌ను ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. భన్వరాల్ షకావత్‌గా ఫహాద్ ఫాజిల్ పాత్ర అత్యంత శక్తిమంతంగా ట్రైలర్‌లో ఆవిష్కృతమైంది. అంతేకాక, పుష్పరాజ్, శ్రీవల్లీల దాంపత్యం నేపథ్యంలో వచ్చే సీన్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తంగా మాస్ ఆడియన్స్ మెచ్చేలా ట్రైలర్ ఉంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.